ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 47
మంగళవారం 16 జూలై 2024 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## గుట్టలో వైభవంగా గిరి ప్రదక్షిణ



.. వివరాలు 2లో

# స్థానిక ఎన్నికలపై సీఎం రేవంత్ దృష్టి

### స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పట్లోగా పెట్టగలం?
### బీసీ కుల గణనకు ఎంత సమయం పడుతుంది?

**కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయండి**

**కేంద్రం నిధులు ఆగకుండా త్వరగా ఎన్నికలు**

**పంచాయతీరాజ్ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి**

**జానారెడ్డి సలహాలు తీసుకోవాలని సూచన**

**56 అంశాలతో చేపడితే ఐదున్నర నెలలు**

**కులగణనపై సీఎంకు అధికారుల వివరణ**



పంచాయతీరాజ్ శాఖకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఎట్టి పరిస్థితుల్లో ఆగే పరిస్థితి తలెత్తకూడదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ముందుగా నిర్దేశించుకున్న ప్రకారం రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టేందుకు ఎంత సమయం పడుతుందో చెప్పాలని అడిగారు. కులగణన పూర్తయ్యాక బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించగలుగుతామో ఒక అంచనాకు రావాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి తక్షణమే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సోమవారం ఆయన పంచాయతీ ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు.

హైదరాబాద్, జూలై 15 : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజ నరసింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ముఖ్యనేత కె.జానారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు

మిగతా 2 లో



### పన్ను చెల్లింపుదారులకు
# మాఫీ లేనట్లే!

**రైతు రుణమాఫీకి మార్గదర్శకాలు విడుదల**

**రేషన్ కార్డు ఆధారంగా రైతుల గుర్తింపు**



హైదరాబాద్,జూలై15 : పంటల రుణమాఫీకి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. కుటుంబానికి రూ.2లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాల బకాయిలకు మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తుందని, రైతు కుటుంబం గుర్తింపునకు రేషన్‌కార్డు ప్రామాణికమని తెలిపింది. పంట రుణమాఫీ కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు

మిగతా 2 లో



# కాంగ్రెస్ గూటికి మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు ఎమ్మెల్యేను పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి**


**10కి పెరిగిన కాంగ్రెసలో చేరిన బీఆర్ఎస్ శాసనసభ్యుల సంఖ్య**

**కండువా కప్పి ఆహ్వానించిన సీఎం**

**తిరిగి వచ్చిన గాలి అనిల్‌కుమార్**

హైదరాబాద్, జూలై 15 : కాంగ్రెసలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి.. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెసలో చేరారు. ఆయనతోపాటు జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, పలువురు కార్పొరేటర్లు, నేతల అనుచరులు కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. సీఎం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర

మిగతా 2 లో




**ప్రజలు చెల్లించే పన్నులతోనే పథకాల అమలు**

# రైతుభరోసాపై అసెంబ్లీలో చర్చ

**అక్రమాలకు తావు లేకుండా రైతు భరోసా**

**రైతుల అభిప్రాయాలపై చట్టసభల్లో చర్చిస్తాం**

**ఆగస్టులో 2 లక్షల రుణమాఫీ: భట్టి విక్రమార్క**

**'ఐటీ' రైతులకూ రైతుభరోసా: పొంగులేటి**

**బీమా కంపెనీలతో చర్చిస్తున్నాం: తుమ్మల**

**వరంగల్ రైతుల అభిప్రాయాల సేకరణ**

తమ ప్రభుత్వంలో ప్రజల అభిప్రాయాలే జీవోలుగా వెలువడుతాయని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రజల అభిప్రాయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఉపాధి హామీ కూలీలు మొదలుకొని రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారని, ఆ పన్నులతోనే ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. రైతు భరోసా పథకం అమలుపై మంత్రివర్గ ఉపసంఘం నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాల స్థాయి విస్తృత సమావేశాల్లో భాగంగా సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులతో హనుమకొండ కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు.

వరంగల్, జూలై 15 : రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలు తీసుకుని పారదర్శకంగా అమలు చేయాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారని తెలిపారు.

ఇప్పటివరకు నాలుగు ఉమ్మడి జిల్లాల్లో రైతుల అభిప్రాయాలను స్వీకరించామన్నారు. వీటిపై శాసనసభ, శాసనమండలిలో చర్చించి.. అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలు కూడా తీసుకుంటామని

మిగతా 2 లో

### తెలంగాణలోనూ ఇక బస్సు
## ఛార్జీల పెంపు తప్పదు

**కర్నాటక తరహాలో అంటూ కెటిఆర్ విమర్శలు**



హైదరాబాద్,జూలై 15 : కర్ణాటకలో ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపు ప్రతిపాదనపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. బస్సు ఛార్జీల పెంపుపై కర్ణాటకను తెలంగాణ అనుసరించే రోజు ఎంతో దూరంలో లేదని

మిగతా 2 లో

### బేగంపేట రైల్వేస్టేషన్‌కు
## రూ. 22.57 కోట్లు

**కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**



న్యూఢిల్లీ, జూలై 15 : బేగంపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులకు కేంద్రం ప్రభుత్వం రూ.22.57 కోట్లు కేటాయించిందని కేంద్ర బొగు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరచడం, సదుపాయాలను కల్పించడంలో భాగంగా చేపట్టిన ఈ పనులు ఇప్పటికే 50శాతం మేర పూర్తయ్యాయని తెలిపారు. నిర్మాణంలో ఉన్న బేగంపేట రైల్వేస్టేషన్ చిత్రాలను ఆయన సోమవారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద బేగంపేట రైల్వేస్టేషన్‌ను ప్రపంచ స్థా యిలో తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
16 జూలై
2024





# స్థానిక ఎన్నికలపై సీఎం రేవంత్ దృష్టి



**మొదటి పేజీ తరువాయి**

సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే కుల గణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని సీఎం అధికారులను ప్రశ్నించారు. గత పంచాయతీ ఎన్నికల్లో అనుసరించిన విధానం, రానున్న ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును అధికారులు వివరించారు. కర్ణాటకలో 2015లో, బిహార్‌లో 2023లో కులగణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కులగణన చేసినప్పటికీ ఇంకా వివరాలు బయట పెట్టలేదని తెలిపారు.

2011లో కేంద్ర ప్రభుత్వం కుల గణనకు ఉపయోగించి ఫార్మట్‌లో 53 కాలాలు ఉన్నాయని, వాటికి మరో మూడు కాలాలు జోడించి కుల గణన చేపడితే ఐదున్నర నెలల్లో పూర్తి చేయవచ్చని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో పంచాయతీ ఎన్నికల విషయంలో అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను కాంగ్రెస్ ముఖ్యనేత, మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ, స్థానిక సంస్థల్లో ఇప్పటిదాకా అమలు చేసిన రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు సంబంధించి, గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలకు సంబంధించి సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏవైనా సందేహాలు వస్తే మాజీ మంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన విషయాల్లో అడ్వొకేట్ జనరల్‌తో చర్చించాలని సూచించారు. మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విషయాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. త్వరగా ఆయా అంశాలపై నివేదిక రూపొందిస్తే శాసనసభ సమావేశాలకు ముందే మరోసారి సమావేశమై ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుందామని సీఎం వెల్లడించారు.



# ఉప్పొంగుతున్న హుస్సేన్‌సాగర్

**ఒక్కరోజు వర్షానికే**

**నిండుకుండలా సాగరం**

**మరో ఐదు రోజులపాటు**

**భారీ వర్ష హెచ్చరిక**

హైదరాబాద్,జూలై 15 : ఆదివారం కురిసిన భారీ వర్షానికి హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. జలాశయంలోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హుస్సేన్‌సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 514 అడుగులు. ప్రస్తుతానికి నీటి మట్టం 513 అడుగులు దాటింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద నీరు మొత్తం హుస్సేన్‌సాగర్‌లో చేరుతోంది. కూకట్‌పల్లి, బంజార, బుల్కాపూర్ నాలాల నుంచి భారీగా వరద వస్తోంది. హుస్సేన్ సాగర్ 2 గేట్లు ఎత్తి వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిమట్టం పెరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై జీహెచ్‌ఎంసీ అధికారులు పరిశీలన చేశారు. మళ్లీ రానున్న 24 గంటల్లో వర్షాలు కురిసే నేపథ్యంలో ముంపునకు గురయ్యే కవాడిగూడ, మిగిలిన ప్రాంతాల ప్రజలనూ జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. నైరుతి రుతుపవనాల కారణంగా ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో జోరు వానలు కురుస్తున్నాయి. నేటి నుంచి ఐదు రోజుల పాటు తెలుగురాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. నైరుతి రుతుపవనాలు బలపడటానికి తోడు.. అల్ప పీడన ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ వర్షాలు ఈ రోజు నుంచి ఐదు రోజుల పాటు అంటే జులై 18 వరకు ఈ వర్షాలు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని కొన్ని జిల్లాలకు వర్ష సూచన చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాలకు తోడు ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం చెప్పింది. ఏపీకి భారీ వర్షసూచన చేసింది వాతావరణశాఖ. రాష్ట్రంలో అల్లూరి సీతరామరాజు, ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ను అమరావతి వాతావరణ శాఖ జారీ చేసింది. ఇక ఏపీలో మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నేడు, రేపు కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉండగా.. అలాగే, రాయలసీమలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.తెలంగాణాకు భారీ వర్ష సూచన ÷లంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా పశ్చిమ, నైరుతి దిశల నుండి ఎక్కువ స్థాయిలో గాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగూడెం, ఖమ్మం, సూర్యపేట, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా.. మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బలమైన నైరుతి రుతుపవనాలకు తోడు.. సముద్ర మట్టానికి 3.1కి.మీ. నుంచి 7.6 కి.మీ. మధ్యలో ఆవర్తనం కొనసాగుతుందని వాతావరణశాఖ చెప్పింది.

# రైతుభరోసాపై అసెంబ్లీలో చర్చ

**మొదటి పేజీ తరువాయి**

చెప్పారు. గతంలో కొండలు, గుట్టలు, ఫాంహౌసలు, రియల్ ఎస్టేట్ ప్లాట్లకు కూడా రైతుబంధు ఇచ్చినట్టుగా నివేదికలు చెబుతున్నాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తమ ప్రజా ప్రభుత్వంలో అలాంటి అక్రమాలకు తావులేకుండా అర్హులైన రైతులకు రైతు భరోసా అందించడంపై సీఎం దృష్టి పెట్టారని పేర్కొన్నారు. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్‌ను రాహుల్‌గాంధీ వరంగల్ నుంచే ప్రకటించారని గుర్తుచేస్తూ.. ఇక్కడి రైతులు చెప్పిన విలువైన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

**ఆదాయ పన్ను చెల్లించే రైతులకూ రైతుభరోసా..**

అదాయ పన్ను (ఐటీ) చెల్లిస్తున్న రైతులకు రైతుభరోసా ఇవ్వరంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఐటీచెల్లించడం వేరు.. రిటర్న్లు దాఖలు చేయడం వేరు అని, ఈ విషయంలో తమ ప్రభుత్వానికి స్పష్టత ఉందని చెప్పారు. చిన్న చిన్న వ్యాపారాలతో, తక్కువ ఆదాయ పన్ను చెల్లించేవారిని రైతుభరోసాకు దూరం చేయకుండా విధి విధానాలు రూపొందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం చెప్పినట్లుగానే ఆగస్టులో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని పునరుద్ఘాటించారు. పంట నష్టాలకు సంబంధించి బీమా కంపెనీలతో చర్చిస్తున్నామన్నారు.

**ధరణి పేరుతో పేదల భూములు మాయం..**

గత ప్రభుత్వం ధరణి పేరుతో పేదల భూములను దోచుకుందని, ఇందిరమ్మ ఇచ్చిన భూములను కూడా లాక్కుందని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. పంటలకు బీమా చేసినట్లే.. పశువులకు కూడా బీమాను వర్తింపజేస్తే బాగుంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు. మరో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రైతుభరోసాతో లోపాలకు తావుండదని, పేద రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని చెప్పారు.

# కాంగ్రెస్‌ను తిడుతూ పోతే ఎలా?

కాంగ్రెస్ ముక్త భారత్ అంటూ మోడీ ఇచ్చిన నినాదం బెడిసి కొట్టింది. ఏదో ఒక పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తూ పాలన సాగించడం ఉత్తమ నాయకుడి లక్షణం కాదు. కాంగ్రెస్‌ను గత పదేళ్లుగా తిట్టి పోస్తూనే ఉన్నారు. ఆ తిట్లే వారికి వరంగా మారాయి. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సంఖ్య వందకు చేరింది. ప్రతిపక్ష హోదా కూడా లేని స్థాయి నుంచి ప్రతిపక్ష హోదాకు వచ్చారు. అలాగే ఇటీవలి ఉప ఎన్నికల్లో కూడా ఇండియా కూటిమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుకేసుకుని వాటిని పరిష్కరించకుండా పరజలను మభ్యపెట్టడం వల్ల మోడీ బలహీనం అయ్యారు. అయినా మార్పు కానరావడం లేదు. ఎమర్జెన్సీని రాజ్యాంగ హత్యా దివస్‌గా ప్రకటించడం కక్షసాధింపు రాజకీయాలకు పరాకాష్ట. ఈ కాలం ప్రజలకు ఇందిర పాలన గురించి పెద్దగా తెలియదు. తెలుసుకునే ఓపిక కూడా లేదు. మోడీ ఏం చేస్తున్నారన్నదే గత పదేళ్లుగా పరిశీలిస్తున్నారు. దేశంలో ప్రధానంగ నిరుద్యోగ సమస్యల విపరీతంగా ఉంది. చదువులు మోయలేని భారంగా మారాయి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మధ్య తరగతి ప్రజలకు జీఎస్టీ వాతలు తట్టుకోలుకుండా ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడం వల్ల మరింత నిరుద్యోగం పెరుగుతుందన్న ఆందోళన కలుగుతోంది. అగ్నివీర్ పథకంతో నాలుగేళ్లకే ఆర్మీ ఉద్యోగాలు పోతున్నాయి. ఇవన్నీ ప్రధాన సమస్యలు. వీటి గురించి ఎక్కడా మాట్లాడడం లేదు. రాజకీయాలు అదేపనిగా చేయరాదు. ఎన్నికల సమయంలో మాత్రమే వాటిని ఉపయోగించాలి. ఇంకా ఇందిర విధించిన ఎమర్జెన్సీ గురించి చర్చిస్తూ..అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తే..ప్రజలు కూఆ మోడీని పక్కదారి పట్టించడం ఎలా అన్నది ఆలోచిస్తారు. పెరుగుతున్న జనాభాను తగ్గించడం, ధరలను తగ్గించడం, జీఎస్టీని తగ్గించడం, ఉద్యోగాలు పెంచడం లక్ష్యంగా పనిచేయకుంటే భారత్ మరింత అథఃపాతాళానికి విసిరివేయబడడం ఖాయం. ఈ సమస్యలపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలి. పరిష్కారాలు కనుగొనాలి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ పదేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేసే సంకల్పం లోపించింది. అయితే అవినీతి మరక అంటకుండా దేశాన్ని పాలించామని చెప్పుకుంటున్నా..కార్పోరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న తీరుపై సర్వత్రా విమర్శలు ఉన్నాయి. అయితే కాంగ్రెస్ తరహా రాజకీయాలకు పెద్ద ఎత్తున తెరతీసారు. తనవైపు వేలెత్తి చూపే అవకాశం లేకుండా తొలినాళ్లలో పాలన సాగించిన మోదీ ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకుంటున్న తీరు సరికాదు. పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. ప్రధానంగా నోట్లరద్దు, జీఎస్టీతో ప్రజలకున్న ఆశలు అడియాశల య్యాయి. తాజాగా 2వేల నోట్ల రద్దు కూడా ఇదే కోవలోకి వస్తుంది. ప్రధానంగా ధరల పెరగుదల విషయంలో పట్టింపు లేకుండా పోయాయి. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా వాటికి ధరలు దక్కడం లేదు. రైతులు ఆందోళ చేస్తున్నా వ్యవసాయాన్ని బలోపేతం చేసే చర్యలు కానరావడం లేదు. గోదాముల్లో ధాన్యం మగ్గుతున్నా బయటకు రావడం లేదు. అలాగే దిగుమతులు కూడా తగ్గడం లేదు. కాంగ్రెస్ తరహా రాజకీయాలు చేస్తున్నారే తప్ప ఆదర్శ రాజకీయాలకు పెట్టింది పేరయిన బిజెపి ఇప్పుడా ముసుగు నుంచి బయటపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠ మసకబారినా, ప్రధానంగా బిజెపికి రాజకీయాలకు చెరగని మచ్చని తెచ్చి పెట్టాయి. పాలన ఎలా ఉన్నా అవినీతి రహితంగా సాగుతుందన్న పేరు ప్రచారం చేసుకోవడం మినహా ఇతర విషయాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. అవినీతి లేకున్నా అక్రమ రాజకీయాలు సాగుతూనే ఉన్నాయి. అమిత్‌షా, మోడీ ద్వయం రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి సఫలం అయ్యారు. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు ఒక్కోసారి వెగటుగా ఉంటాయనడానికి ఇటీవలి పరిణామాలు ఉదాహరణగా చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టు కోలేం. అలాగే గతంలో మీరు చేయలేదా అని ఎదురుదాడి చేయడం ఇటీవల అలవాటయ్యింది. మిగతా నాయకులకు, మిగతా పార్టీలకు, భారతీయ జనతా పార్టీకి చెందిన మోదీ, షాలకు కూడా తేడా లేదని ప్రజలు గుర్తించారు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం రెపరెపలాడా లన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టుపట్టి పోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపైకి ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి సంస్థలను ప్రయోగించి నానా ఇబ్బందులు పెట్టారు. సీబీఐ ద్వారా విచారణలు జరిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అడుగుజాడలలో అదే నరేంద్ర మోదీ, అవే ఏజెన్సీలను కాంగ్రెస్ నాయకుల మీదకు ప్రయోగిస్తున్నారు. పార్టీ ఫిరాయింపు లను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండేది.ఇప్పుడు అదే పంథాను మోడీ నేతృత్వంలోని బిజెపి అనుసరిస్తోంది. మొత్తంగా బిజెపి కాంగ్రెస్‌కన్నా భిన్నంగా ఉండలేకపోతోంది. ఈ పరిస్థితి మారాలి. దేశం కోసం కష్టపడతానంటున్న మోడీ ప్రధాన సమస్యలను పట్టించుకోవాలి. తాను నిర్మించుకున్న కోటనుంచి బయటకు రావాలి. ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలి. ప్రజల కోసం పనిచేయడం అలవాటు చేసుకోవాలి. సామాన్యులు, మధ్య తరగతి ప్రజల బతుకులు దుర్భరంగా మారినవేళ వారిని కష్టాల కొలిమి నుంచి బయటపడేసే మార్గాలను ఆలోచన చేయాలి. అప్పుడే మోడీకి ఆదరణ వస్తుంది.

# పన్ను చెల్లింపుదారులకు మాఫీ లేనట్లే!

**మొదటి పేజీ తరువాయి**

చేయనున్నారు. రుణమాఫీ నగదు నేరుగా లబ్దిదారుల రుణఖాతాల్లోనే జమకానుంది. ఆరోహణ క్రమంలో రుణమాఫీ సొమ్ము విడుదల చేస్తారు. ఎస్‌హెచ్‌జీ, జేఎల్‌జీ, ఆర్‌ఎంజీ, ఎల్‌ఈసీఎస్ రుణాలకు, రీషెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదు. రుణమాఫీపై రైతుల సందేహాలు తీర్చేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రైతు సమస్యలు ఉంటే 30 రోజుల్లో పరిష్కారించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలకు వెబ్ పోర్టల్ చూడొచ్చు. లేదా మండల సహాయ కేంద్రాలను సంప్రదించవచ్చని తెలిపింది.

అన్ని వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార బ్యాంకుల నుంచి రైతులు ఈ కాలంలో రుణాలు తీసుకుంటే వారికి కూడా రుణమాఫీ వర్తించనుంది. వ్యవసాయశాఖ కమిషనర్, సంచాలకులు (డీఓఏ) పంట రుణమాఫీ 2024 పథకాన్ని అమలు చేస్తారు. హైదరాబాద్‌లో గల నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ పథకానికి భాగస్వామిగా ఉంటుంది. వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ఐసీ కలిసి ఐటి పోర్టల్ నిర్వహిస్తారు. ఆ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. ఐటి పోర్టల్ ఆర్థికశాఖ నిర్వహించే ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌కి బిల్లులు సమర్పించడం, పథకానికి సంబంధించిన భాగస్వాములతో సమాచారం పంచుకోవడం, రైతులు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకమైన మాడ్యూల్స్ ఉంటాయి. పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారిని బ్యాంకు నోడల్ అధికారిగా (బీఎస్) నియమిస్తారు. బ్యాంకు నోడల్ అధికారి బ్యాంకులకు వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ఐసీ మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. బ్యాంక్ నోడల్ అధికారులు తమ సంబంధిత బ్యాంక్ యొక్క పంట రుణాల డేటాను డిజిటల్ సంతకం చేయాల్సి ఉంటుంది.

# కాంగ్రెస్ గూటికి మహిపాల్‌రెడ్డి

**మొదటి పేజీ తరువాయి**

రాజనర్సింహ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు. గూడెం మహిపాల్‌రెడ్డి కుటుంబంపై మైనింగ్ కేసులు నమోదు కావడం, ఆ తర్వాత ఈడీ సోదాలు చేపట్టడం తెలిసిందే. అది జరిగిన కొన్ని రోజులకే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నప్పుడు.. మహిపాల్‌రెడ్డి కూడా వెళ్లడంతో కాంగ్రెసలో ఆయన చేరుతారని ప్రచారం జరిగింది. చివరకు ఆదివారం తన అనుచరులతో సంప్రదింపులు జరిపిన మహిపాల్‌రెడ్డి.. కాంగ్రెసలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. సోమవారం తన అనుచరులతో పాటు సీఎం సమక్షంలో కాంగ్రెసలో చేరారు. మరోవైపు.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ దక్కక పోవడంతో బీఆర్ఎసలో చేరిన గాలి అనిల్‌కుమార్.. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. సోమవారం ఆయన కూడా సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు.

కాగా, మహిపాల్‌రెడ్డి చేరికతో కాంగ్రెసలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య పదికి చేరింది. ఫిరాయింపుల నిరోధక చట్టంలోని వెసులుబాటు ప్రకారం మూడింట రెండు వంతుల మంది ఎమ్మెల్యేలు కాంగ్రెసలో చేరితేనే టీఆర్ఎసఎల్పీ విలీనమైనట్లుగా పరిగణిస్తారు. ఈ లెక్కన 26మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెసలో చేరాల్సి ఉంది. ఈ లెక్కన మరో 16మంది ఎమ్మెల్యేలు చేరితే సీఎల్పీలో బీఆర్ఎసఎల్పీ విలీనం కానుంది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో చేరికల ప్రక్రియను సీఎం వేగవంతం చేయనున్నట్లు చెబుతున్నారు.

# తెలంగాణలోనూ ఇక బస్సు ఛార్జీల పెంపు తప్పదు

**మొదటి పేజీ తరువాయి**

పేర్కొన్నారు. ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన పోస్ట్ చేశారు. ఏదైనా ఉచితంగా ఇస్తామంటున్నారంటే మరో ఆలోచనతో తీసుకెళ్తున్నట్లేనని తెలిపారు. ఉచితంగా ఇస్తామన్నారంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కర్ణాటకలో బస్సు టికెట్ ఛార్జీల్ని పెంచేందుకు కేఎస్ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ బస్సుల్లో ఛార్జీల పెంపు అనివార్యమని కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్ఆర్ శ్రీనివాస్ ఇటీవల తెలిపారు. 15 నుంచి 20శాతం మేర ఛార్జీల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనల్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు ఆయన చెప్పారు. 'ఇంధనం, ఆటో విడిభాగాల ధరలు గణనీయంగా పెరిగాయి. 2019 నుంచి బస్సుల్లో టికెట్ ఛార్జీల్ని పెంచలేదు. 2020 నుంచి కేఎస్ఆర్టీసీ ఉద్యోగుల వేతన సవరణ జరగలేదు. అందువల్ల టికెట్ ధరలను పెంచడం తప్పడం లేదు. గత మూడు నెలల్లో కార్పొరేషన్‌కు రూ.295 కోట్ల నష్టం వాటిల్లింది. 40 కొత్త ఓల్వో బస్సుల్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. ఇప్పటివరకు 600 సాధారణ బస్సుల్ని కొనుగోలు చేశాం' అని తెలిపారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు

## బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ షబ్బీర్ అలీ



కామారెడ్డి,జూలై 15 : ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని మాజీమంత్రి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. గతంలో ప్రభుత్వ పథకాల పేరుతో 9ఏళ్లల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు భారీగా సంపాదించారని షబ్బీర్ ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, కరెంట్, జీతాలు తదితర విషయాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ చేస్తోందని అన్నారు,. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. మిషన్ భగీరథ పెద్ద ఫ్రాడ్ అని తేలిందని అన్నారు. ధరణి ఒక దుర్మార్గమైన సాఫ్ట్‌వేర్ అని కూడా తేలిపోయిందని మండిపడ్డారు. ఏ గ్రామంలో మిషన్ భగీరథ నీళ్ళు రావడం లేదన్నారు. పైపులు, ట్యాంకులు ఉన్నాయి గానీ నీళ్ళు రావడం లేదన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని స్పష్టం చేశారు. కరెంట్ కోసం బీఆర్ఎస్ చేసింది ఏంటి అని ప్రశ్నించారు. అప్పుడు చేసి మింగారని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్ల పేరుతో నిధులు దిర్వినియోగం చేశారని అన్నారు. అయినా బీఆర్ఎస్ నేతలకు అవగాహన రావడం లేదని విమర్శించారు. ఉచిత విద్యుత్‌పై బీఆర్ఎస్ చేసింది ఏంటి అని ఆయన ప్రశ్నించారు. 1999 మేనిఫెస్టో లోనే ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పామన్నారు. 'మేము చేసిన పనిని కంటిన్యూ చేస్తూ మేం చేస్తున్నాం అని చెప్తే ఎలా?' అంటూ నిలదీశారు. బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్, హరీష్ పని అయిపోయిందన్నారు. ఎత్తిపోయిన బీఆర్ఎస్ గురించి ఏం మాట్లాడుతాం అంటూ వ్యాఖ్యలు చేశారు. లక్షల కోట్ల రూపాయలు దండుకోవడం తప్పా కేసీఆర్ ఏం చేయలేదన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని కుటుంబం ఉండకూడదు అనేది కాంగ్రెస్ పాలసీ అని అన్నారు. అందుకే ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అందరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సింగరేణి సంస్థ రాష్ట్ర అస్థి. గనులన్ని సింగరేణికి ఉండేలా చూస్తామన్నారు. ప్రభుత్వ అండతో ప్రైవేట్ సంస్థలు శ్రమ దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. ధరణి వల్ల లక్షల మంది తమ భూములపై హక్కులు కోల్పోయారన్నారు. ధరణి వల్ల ప్రజలకు చాలా నష్టం కలిగిందని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ద్వారా ప్రజల సంపద ప్రజలకు పంచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజల అవసరాలే తమ అజెండా అన్నారు. గతంలో సంపద, వనరులు, స్వేచ్ఛ పాలకులకే పరిమితమయ్యాయని అన్నారు. తాము ఏం చేశామో ప్రజలకు తెలుసన్నారు. తొమ్మిది ఏండ్లలో ఏదో అద్భుతం జరిగినట్టు కేసీఆర్ భ్రమ కల్పిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ వనరులను ప్రభుత్వ పెద్దలు దోచేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ యువత కాంగ్రెస్‌కు పట్టం కట్టారని అన్నారు. ధరణితో తమ భూములు తమకు కాకుండా చేసారని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ పూర్తిగా ఫెయిల్ అయిందన్నారు. కేసీఆర్ పాలనలో ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని చెప్పుకొచ్చారు. తెలంగాణలో స్వేచ్ఛనే లేకుండ పోయిందన్నారు. భయం భయంగా బతకాల్సిన పరిస్థితి తెలంగాణలో ఉండేదన్నారు. పోలీస్ వ్యవస్థ అధికార పార్టీ ఎమ్మెల్యేల చేతిలోకి పోయిందన్నారు. ఇవన్నీ పోయి ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛగా బతుకుతున్నారని, ఇచ్చిన హామీల అమలుకు సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
16 జూలై
2024



# న్యాయశాఖ మంత్రివర్యులకు పులి దామోదర్ వినతి పత్రం




శ్రీశైలం, జూలై 15 ( రోమింగ్ న్యూస్) : సమాజంలో అడ్వకేట్లు మంచి పని కోసం చట్టాలపై మరియు కేసులు విషయంలో ఒకా లతులు తీసుకొని కేసులు చేస్తూ ప్రజలకు న్యాయం చేస్తూ ఉంటారు .అలా మంచి పని చేసే అడ్వకేట్ ల పై కొంతమంది రౌడీ మూకలు, దొంగలు ఓర్వలేక జీర్ణించుకోలేక న్యాయవాదులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ కొందరిని హత్యలు చేస్తున్నారు. భారతదేశంలో కొన్ని రాష్ట్రాలలో, జిల్లాలలో ఇలా అడ్వకేట్ ల పై దాడులకు పాల్పడు తున్నందుకు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అనేది ఉన్నది మొదటి సారిగా రాజస్థాన్ రాష్ట్రంలో, ఢిల్లీలో, కర్ణాటకలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులు అసెంబ్లీలో తీర్మానం చేసి ఈ అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను అమలులో చేశారు. ఇదేవిధంగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను వర్తింప జేసే విధంగా అమలు చేయాలని న్యాయశాఖ మంత్రిని పులి దామోదర్ కోరడం జరిగినది. ఇందుకు గాను అందరితో సంతకాలు చేయించి న్యాయశాఖ మంత్రి గారికి ఈ దినము మెమరాండం నంద్యాలలో మంత్రిగారి కార్యాలయంలో ఇవ్వడం జరిగినది. ఈ మెమరాండం చదివి మంత్రిగారి స్పందించి సానుకూలంగా సమాధానం ఇస్తూ నేను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. మంత్రిగారు ఈ విషయంపై స్పందించినందుకు అడ్వకేట్ లందరూ న్యాయశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

# లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా నరేందర్ రెడ్డి



నకిరేకల్ జులై 15( రోమింగ్ న్యూస్) : నకిరేకల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి అధ్యక్షునిగా పాశం నరేందర్ రెడ్డి ఉపాధ్యక్షులుగా మన్నెం నగేష్ కార్యదర్శిగా కొత్త వీరారెడ్డి కోశాధికారిగా కనుకుంట్ల మంగమ్మ సహాయ కార్యదర్శిగా యానాల లింగారెడ్డి తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు ఎన్నికల అధికారులుగా పోతుల వెంకటనారాయణ ఎం రాములు సిహెచ్ సత్యనారాయణ వ్యవహరించారు ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ లారీ ఓనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు పాటుపడతానన్నారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశ%శీ%ను కలిసారు నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు నూతన కమిటీ ఎమ్మెల్యేను సన్మానించారు

# ఇక ఆన్‌లైన్‌లో సిఎం రిలీఫ్ ఫండ్

## అమల్లోకి వచ్చిన ఆన్‌లైన్ విధానం

హైదరాబాద్,జూలై 15 : రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తులను ఆన్‌లైన్ స్వీకరణకు శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం స్వీకరిస్తోంది. అందులో భాగంగా ఆన్‌లైన్ లింక్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందుకోసం స్థానిక మంత్రి, ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీలకు లాగిన్ ఐడీని ప్రభుత్వం కేటాయించింది. వారి వద్దకు వెళితే సిఎంఆర్ఎఫ్ ఆన్‌లైన్ పోర్టల్‌లో పేషెంట్ల వివరాలు నమోదు చేస్తారు. బాధితులు సమర్పించిన సర్టిఫికెట్లు సరైనవా? కాదా అనే వివరాలను తెలుసుకోవడానికి పోర్టల్‌లో ప్రత్యేక విధానాన్ని ఏర్పాటు చేశారు. తాజాగా సిఎంఆర్ఎఫ్ పారదర్శకంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్‌ను రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో సిఎంఆర్ఎఫ్ నిధుల మళ్లింపు నేపథ్యంలో ఈ విధానాన్ని రూపొందించారు. ఇక నుంచి ముఖ్యమంత్రి ప్రావిడెంట్ ఫండ్ దరఖాస్తులను ఈ వెబ్‌సైట్‌లోనే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. స్థానిక మంత్రి, ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీలు సిఎంఆర్ఎఫ్ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలను తీసుకుని వారి సిఫార్సు లేఖను అప్‌లోడ్ చేస్తారు. దరఖాస్తులో సంబంధిత దరఖాస్తుదారు బ్యాంకు ఖాతా నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేయనున్నారు. దరఖాస్తును అప్‌లోడ్ చేసిన తర్వాత సిఎంఆర్ఎఫ్‌కి సంబంధించిన కోడ్ ఇస్తారు.ఆ కోడ్ ఆధారంగా ఒరిజినల్ మెడికల్ బిల్లులను సెక్రటేరియట్‌కు సమర్పించాలి. నిర్ధారణ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు సంబంధిత ఆసుపత్రులకు పంపిస్తారు. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే, సిఎంఆర్ఎఫ్ దరఖాస్తు ఆమోదిస్తారు. అనంతరం లబ్దిదారునికి చెక్కు తయారవుతుంది. దరఖాస్తుదారు ఖాతా నంబర్ చెక్కుపై ముద్రించబడుతుంది. దీంతో చెక్ పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు స్వయంగా దరఖాస్తుదారులకు చెక్కులను అందజేస్తారు.

# బిజెపి,బిఆర్ఎస్ రహస్య ఒప్పందం

## కవితకు బెయిల్ కోసమేనన్న ఆది శ్రీనివాస్

హైదరాబాద్,జూలై 15 : తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రహస్య ఒప్పందాలకు నెమ్మదిగా తెర దించుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఢిల్లీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు బీజేపీతో సంప్రదింపులు జరిపారని అన్నారు. కవిత బెయిల్ కోసమే బీజేపీకి బీఆర్ఎస్ నేతలు స్నేహ హస్తం అందిస్తున్నారని చెప్పారు. హరీష్ రావు ప్రజా నేత అని బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ డబ్బాలు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. నిన్నటి దాకా హరీష్ రావుపైన దుమ్మెత్తిపోసిన బీజేపీ నేతలు ఇప్పుడు పొగుడుతున్నారని అన్నారు. హరీష్ రావును పొగడ్తలతో ముంచెత్తడం వెనుక ఆయనతో రాజీనామా చేయించి బీజేపీ తరపున పోటీ చేయించే ఆలోచన ఉన్నట్లు కనిపిస్తోందని అన్నారు. అందుకే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినా సిద్దిపేటలో హరీష్ రావు మళ్లీ గెలుస్తాడని బండి సంజయ్ అంటున్నారని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ పైన ఒత్తిడి తెచ్చి బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. విలీనానికి కేసీఆర్ ఒప్పుకోక పోతే హరీష్ రావు ను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్‌ను చీల్చే అవకాశాలున్నాయని చెప్పారు. మహారాష్ట్రలో ఏక్ నాథ్ షిండే ప్రయోగాన్ని తెలంగాణలో బీఆర్ఎస్ పైన బీజేపీ చేస్తుందనే అనుమానాలున్నాయని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడం కోసమే రెండు పార్టీలు ముసుగు తీసి వస్తున్నాయని విమర్శించారు. బండి సంజయ్, హరీష్ రావు ప్రజా నేత అని చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సమర్థిస్తారా..? అని ప్రశ్నించారు. మెదక్‌లో బీజేపీ గెలుపు కోసం లోపాయికారీ ఒప్పందం జరిగినట్లు బండి సంజయ్ వ్యాఖ్యలు చూస్తుంటే అర్థమవుతుందని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటైనా తెలంగాణలో కాంగ్రెస్‌కు ఇబ్బంది లేదని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# గుట్టలో వైభవంగా గిరి ప్రదక్షిణ





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి గిరిప్రదక్షిణ మహోత్సవం కన్నుల పండువుగా జరిగింది. జై నరసింహ... జై జై నరసింహ అంటూ భక్తులు యాదగిరి కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేస్తూ తమ భక్తీ ప్రపత్తులను చాటుకున్నారు. లక్ష్మీనరసింహ పాహిమాం... పాహిమాం అంటూ భక్తులు యాదగిరీశుడిని స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైపు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు ఆలయ ఈవో భాస్కరరావు తదితరులు సందడి లో భాగస్వాములయ్యారు. అదేవిధంగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, దేవాదాయ శాఖ కమీషనర్ హన్మంత రావు , వై టి డి ఏ వైస్ చైర్మన్ కిషన్ రావు లు శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఈఓ భాస్కర్ రావు దర్శనం ఏర్పాట్లు గావించి వేదాశీర్వచనం తదుపరి శ్రీ స్వామి వారి ప్రసాదము అందజేసియున్నారు. అనంతరము ఈ రోజు నిర్వహింప బడిన వనమహోత్సవములో మొక్కలు నాటడం జరిగినది.







# దోమల నియంత్రణతోనే డెంగ్యూ నివారణ







- ప్రగతి స్కూల్ లో డెంగ్యూ అవగాహన కార్యక్రమం
- అప్రమత్తత అవశ్యం: ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్
- విద్యార్థులకు డెంగిపోయే అవగాహన కల్పించిన మెడికల్ ఆఫీసర్ జ్యోతి






అంబర్ పేట, రోమింగ్ న్యూస్: దోమల వలన డెంగ్యూ, మలేరియా మరియు ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, దోమలను నియంత్రించడం వలన ఈ వ్యాధులను నియంత్రించవచ్చని జిహెచ్ఎంసి మెడికల్ ఆఫీసర్ హేమలత అన్నారు. అంబర్పేట్ లోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. ఒక దోమ జీవిత కాలం సుమారు 30 రోజులు, ఒక దోమ సుమారు వెయ్యి గుడ్లను పెడుతుందని తెలియజేశారు, కొబ్బరి చిప్పలలో, పూల కుండీలలో, నిల్వ ఉన్న నీళ్లలో దోమలు గుడ్లు పెడతాయని, మన పరిసరాలను పరిశుభ్రంగా పొడిగా ఉంచుకోవడం వల్ల దోమలను నివారించవచ్చునని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే ను పాటిస్తూ పరిసరాలను పూర్తిగా నీళ్లు లేకుండా శుభ్రం చేసుకోవడం వలన ఈ దోమలను నియంత్రించవచ్చు. నీళ్లు ఉన్నచోట ఏదైనా ఒక నూనె చల్లితే అది నీళ్లపై ఒక పొర ఏర్పడి దోమలు గుడ్లు పెట్టకుండ నివారించవచ్చని వివరించారు. రావడం వల్ల అనేకమంది ప్లేట్లెట్స్ తగ్గిపోయి. ఈ కార్యక్రమంలో ప్రగతి విద్యానికేతన్ పాఠశాల చైర్మన్, ట్రస్మా రాష్ట్ర శాఖ అధ్యక్షులు సాధుల మధుసూదన్ మాట్లాడుతూ పిల్లలందరికీ దోమల వలన సంక్రమించే వ్యాధుల పట్ల మరియు ఈ దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులందరికీ వ్యాసరచన పోటీలు ప్రదర్శనలు ఏర్పాటు చేసి వారికి బహుమతులను ప్రధానం చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని అంబర్పేట నియోజకవర్గం లోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ట్రస్మా సహకారంతో నిర్వహిస్తామని మెడికల్ ఆఫీసర్ హేమలత గారు తెలియజేశారు ట్రస్మా సభ్యులు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అంబర్పేట్ మండల్ ట్రస్మ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి తెలియజేశారు ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు, జిహెచ్ఎంసి సిబ్బంది రాఘవేందర్, పాషా మరియు పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
16 జూలై
2024



# తిరుమల ఆర్జిత సేవా టిక్కెట్లు

## 18న విడుదల చేయనున్నట్లు టిటిడి వెల్లడి

తిరుమల,జూలై 15 : తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా, అంగప్రదక్షిణ తదితర సేవలకు సంబంధించి అక్టోబరు నెల కోటా టికెట్ల విడుదల తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. ఆర్జిత సేవా టికెట్లను జూలై 18న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జూలై 20న ఉదయం 10 వరకు నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందినవారు జూలై 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు రుసుము చెల్లించాలని పేర్కొంది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను జూలై 22న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన అక్టోబర్ నెల కోటాను జూలై 22న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షిణం టోకెన్లను జూలై 23 ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్లను జూలై 23 ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన భక్తులు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఇస్తోన్న ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్లను జూలై 23 మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. అక్టోబర్ నెలకు సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను జూలై 24న ఉదయం 10 గంటలకు, గదుల కోటాను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు. తిరుమల-తిరుపతి శ్రీవారి కోటా ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం 1 గంటకు ఆన్‌లైన్‌లోనే విడుదల చేయనున్నారు. శ్రీవారి సేవా టికెట్లను వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.

# రసాభాసగా చెక్కుల పంపిణీ కార్యక్రమం

## ప్రోటోకాల్ పాటించలేందటూ ఎమ్మెల్యే సబిత నిరసన

హైదరాబాద్,జూలై 15 : మహేశ్వరం నియోజకవర్గం, ఆర్కేపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయంలో బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. ప్రోటోకాల్ ఉల్లంఘించి ఓడిపోయిన కాంగ్రెస్ నాయకునితో చెక్కులు పంపిణీ చేయించడంపై మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వేదిక కింద కూర్చొని సబితా ఇంద్రారెడ్డి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నుండి చేపట్టే ఏ కార్యక్రమమైనా పార్టీ పరంగా చేస్తాం.. ఓడిపోయిన వ్యక్తుల చేతనే కార్యక్రమాలను నిర్వహిస్తామని ఒక చట్టం తీసుకొస్తే తమకేమీ ఇబ్బంది లేదని తెలిపారు. గెలిచిన వ్యక్తులు అంటే గౌరవం లేకుండా రాజకీయ ఏజెండాగానే పాలన నడిపిస్తున్నారని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. రాష్ట్రంలో అత్యాచారాలు, దోపిడీలు చేస్తుంటే ఈ ప్రభుత్వం కళ్లు మూసుకొని పాలన కొనసాగిస్తుందని ఆమె విమర్శించారు. నిరుద్యోగులంతా రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి కనపడటం లేదని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులను గౌరవించే సంస్కృతిని ఈ ప్రభుత్వం మర్చిపోతుందని, స్పీకర్ ఈ వ్యవస్థను గాడిలో పెట్టాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులకు భంగం

## ప్రోటోకాల్ పాటించకుండా అవమానం

## సబితా ఇంద్రారెడ్డి ఘటపై స్పీకర్‌కు కెటిఆర్ లేఖ

హైదరాబాద్,జూలై 15 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారాస ఎమ్మెల్యేల హక్కులను కాలరాసే విధంగా కొత్త సంస్కృతిని తీసుకొచ్చిందని, కావాలనే విపక్ష ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగిస్తోందని భారాస నేత కేటీఆర్ ఆక్షేపించారు. ప్రోటోకాల్ ఉల్లంఘటనలకు సంబంధించి ఆయన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు లేఖ రాశారు. ప్రతి సందర్భంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకొన్న ఎమ్మెల్యేలకు స్థానిక నియోజకవర్గంలో జరిగే ఏ పనికి సంబంధించైనా ప్రోటోకాల్ ఉంటుంది. కాంగ్రెస్ నాయకులుకావాలని భారాస ఎమ్మెల్యేలను అవమానించే లా ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్దిదారులకు అందించాల్సిన చెక్కులను స్థానిక ఎమ్మెల్యేలను కాదని, కాంగ్రెస్ నాయకులే పంపిణీ చేస్తున్నారు. హుజూరాబాద్, మహేశ్వరం, అసిఫాబాద్ సహా భారాస ఎమ్మెల్యేలు ఉన్న చాలా నియోజకవర్గాల్లో ఇలాగే జరుగుతోంది. శాసనసభ్యుల హక్కులు, వారికి ప్రోటోకాల్ పరిరక్షణ, గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత శాసనసభాపతిదే అని లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేల హక్కుల రక్షణ విషయంలో సభాపతి అధికారాలను వినియోగించి చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు వెంటనే సీఎస్ సహా అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. 'మూడుసార్లు మంత్రి, ఐదు సార్లు ఎమ్మెల్యే అయిన మహిళా ప్రజాప్రతినిధికి ఇందిరమ్మ రాజ్యంలో గౌరవం లేదా? ప్రజలు గెలిపించిన నాయకులకు విలువ లేదా?' అని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని విస్మరించి.. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, మూడోస్థానానికి పరిమితమైన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి అధికార యంత్రాంగం సెల్యూట్ కొట్టడం ఏంటని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల్లో ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించడం లేదని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించిన ఆయన.. ప్రోటోకాల్ విషయంలో ప్రజాప్రతినిధులకు జరుగుతోన్న అవమానం పట్ల స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

# డ్రగ్స్ విక్రయ ముఠా అరెస్ట్

## ఐదురుగిరి అరెస్ట్..మరో ఇద్దరు పరారీ

హైదరాబాద్,జూలై 15 : డ్రగ్స్ విక్రయ ముఠాను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు డీసీపీ శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. అరెస్టయిన వారిలో ఇద్దరు నైజీరియన్లు కూడా ఉన్నట్లు తెలిపారు. రూ.35 లక్షల విలువైన 199 గ్రాముల కొకైన్‌తోపాటు, రెండు పాస్‌పోర్టులు, 10 ఫోన్లు, 2 బైకులను సీజ్ చేశామన్నారు.నిందితులను ఒనౌహా బ్లెస్సింగ్, అజీజ్ నోహీం, వెంక గౌతమ్, వరుణ్ కుమార్, మహ్మద్ షరీఫ్‌లుగా గుర్తించారు. పరారీలో ఉన్న ఇద్దరి గురించి సమాచారం ఇస్తే రూ.2 లక్షల రివార్డు ఇస్తామని డీసీపీ ప్రకటించారు. ' అనౌహా ÷-లబెస్సింగ్ ఇక్కడికి డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తుంది. ఇప్పటి వరకు ఆమె 20సార్లు నైజీరియా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చినట్లు గుర్తించాం. ఆమె దగ్గర 13 మంది డ్రగ్స్ కొనుగోలు చేసినట్టు గుర్తించాం. వారిలో ఆరుగురికి కొకైన్ టెస్టులో పాజిటివ్ వచ్చింది. వీరిపైనా కేసులు నమోదు చేశాం. పాజిటివ్‌గా తేలిన వారిలో అమన్ ప్రీత్‌సింగ్, అంకిత్, ప్రసాద్, నిఖిల్ తదితరులు ఉన్నారు ' అని డీసీపీ వివరించారు.

# రామసేతు వంతెన కాల్పనికం కాదు

## అది నిజమైన సేతువే ..నిర్ధారించిన ఇస్రో

శ్రీహరికోట,జూలై 15 : భారత్, శ్రీలంకల మధ్య రామసేతు వంతెన కాల్పనికం కాదని, నిజమేనని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. ఇస్రో శాస్త్రవేత్తలు అమెరికాకు చెందిన ఐస్‌శాట్ 2 డేటాను వినియోగించి తమిళనాడు లోని ఈ వంతెనకు సంబంధించిన మ్యాప్‌ను విడుదల చేశారు. భారత్, శ్రీలంక మధ్య ఉండే ఈ వంతెన పొడవు 29 కిమీ ఉండగా, ఎత్తు సముద్ర గర్భం నుంచి 8 మీటర్లు ఉన్నట్టు నిర్ధారించారు. ఈ వంతెన తమిళనాడులోని రామేశ్వరం ద్వీపం ఆగ్నేయ దిక్కులోని ధనుష్కోడి నుంచి శ్రీలంక మన్నారు ద్వీపంలోని తలైమన్నార్ వాయువ్య దిశ వరకు విస్తరించి ఉంది. దీనిని సున్నపురాతితో నిర్మించినట్టు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ సేతువు 99.98 శాతం నీటిలో మునిగి ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

# రాజ్యసభలో 20 స్థానాలు ఖాళీ

## ఈ యేడే ఎన్నికల నిర్వహణ... ఎగువసభలో తగ్గిన బిజెపి బలం

న్యూఢిల్లీ,జూలై 15 : ప్రస్తుతానికి రాజ్యసభలో మొత్తం 20 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 11 మంది ఎన్నికైన సభ్యుల స్థానాలు ఉన్నాయి. ఆయా స్థానాలకు ఈ ఏడాదే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. వీటిలో మహారాష్ట్ర, అసోం, బీహార్‌లలో 2, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, త్రిపురలలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. బీజేపీ నేతృత్వంలోని కూటమి అసోం, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, త్రిపురలలో 7 సీట్లు గెలిచే అవకాశం ఉంది. ఇక మహారాష్ట్రలోనూ రెండు స్థానాలు గెలిచే ఛాన్స్ ఉంది. ఈ ఏడు స్థానాలు, నామినేటెడ్ సభ్యులకు తోడు వైసీపీ మద్దతు ఇస్తే ఎన్డీయే కూటమి బిల్లులను గట్టెక్కించుకోగలుగుతుంది. ప్రస్తుత రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 225గా ఉంది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బలం 87గా ఉంది. కాంగ్రెస్‌కు 26, తృణమూల్ కాంగ్రెస్‌కు 13, ఆమ్ ఆద్మీ పార్టీ, డీఎంకే పార్టీలకు చెరో 10 మంది చొప్పున రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. ఇక ఎన్డీయే, ఇండియా కూటములలో లేని బీఆర్ఎస్ వద్ద నలుగురు, పలువురు స్వతంత్రులు ఉన్నారు. ఎన్డీయే పార్టీలైన టీడీపీ, జేడీయూలతో కలిసి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ బలం రాజ్యసభ లోనూ తగ్గింది. నామినేటెడ్ ఎంపీలైన రాకేశ్ సిన్హా, రామ్ షకల్, సోనాల్ మాన్‌సింగ్, మహేశ్ జెఠ్మలానీల పదవీకాలం శనివారంతో పూర్తయింది. అధికార పార్టీ సలహా మేరకు ఈ నలుగురిని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము రాజ్యసభకు నామినేట్ చేశారు. ఆ నలుగురు ప్రధాని మోదీ సారథ్యంలోని ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. శనివారంతో వీరి పదవీకాలం ముగిసిపోవడంతో రాజ్యసభలో బీజేపీ ఎంపీల సంఖ్యాబలం 86కి పడిపోయింది. పర్యవసానంగా మొత్తం 245 మంది సభ్యులు ఉన్న రాజ్యసభలో ఎన్డీయే కూటమి సంఖ్యాబలం 101కి పడిపోయింది. రాజ్యసభ మెజారిటీ మార్క్ 113 కంటే ఎన్డీయే ఎంపీల సంఖ్య ఇంకా తక్కువగానే ఉంది. ఎగువ సభలో సంఖ్యా బలం తగ్గడంతో అధికార ఎన్డీయే కూటమి బిల్లులను ఆమోదం కోసం ఇతర పార్టీలపై ఆధారపడాల్సి ఉంటుంది. తమిళనాడులోని అన్నాడీఎంకే, ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్‌సీపీ వంటి పార్టీలను ఆశ్రయించాల్సి ఉంటుందని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ వద్ద 11, అన్నాడీఎంకే వద్ద 4 మంది సభ్యులు ఉన్నారు.

# భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాల్సిందే





## ప్రభుత్వాలు కూలుస్తామంటే ఊరుకోవాలా?

## బండి సంజయ్, కెటిఆర్ ల తీరుపై మండిపడ్డ పొన్నం

కరీంనగర్,జూలై 15 : భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలు నాటాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాల్లో 43 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ అలవాటు అందరి జీవితంలో భాగం కావాలని కోరారు..ప్రభుత్వం మొక్కలు పంపిణీ చేస్తోంది. ఎన్ని చేసినా ప్రజల సహకారం కావాలి. కాలుష్యం తగ్గి వ్యాధులు దరి చేరకుండా ఉండాలంటే అందరూ దీనిపై దృష్టి సారించాలి. ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేయాలి. ఇది ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజల కార్యక్రమంగా, సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. భాజపా ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలను కూల్చింది. ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోవాలా? డిసెంబర్ 3 వరకు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే ఆలోచనే లేదు. ప్రభుత్వాన్ని కూల్చుతామని మీరంటుంటే.. నిలబెట్టడానికి వారు వస్తున్నారు. మేం ధర్మం తప్పలేదు.. ప్రభుత్వ సుస్థిరత కోసమే చేరికలు. కులగణనపై మరో రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటాం' అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. బండి సంజయ్, కేటీఆర్ తీరు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టే ఉందన్నారు. బీజేపీలో చేరాలంటే రాజీనామా చేసి పార్టీలో చేరాలన్న బండి సంజయ్ కు కౌంటర్ ఇచ్చారు పొన్నం. బీజేపీ కూల్చిన ప్రభుత్వాల్లో ఎంత మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వాన్ని కూల్చుతామంటే..చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు మంత్రి పొన్నం. తాము ధర్మం తప్పలేదని.. కుల గణనపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. డిసెంబర్ 3 వరకు ఎమ్మెల్యేలను చేర్చుకోవాలన్న ఆలోచన తమకు లేదన్నారు. ప్రభుత్వాన్ని కూల్చుతామని బీఆర్ఎస్ అంటుంటే....నిలబెట్టడానికి ఎమ్మెల్యేలు వస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ సుస్థిరత కోసమే చేరికలని అన్నారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ కు చెందిన 9 మంది ఎమ్మెల్యేలు, ఆరుగుగు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసింది. మరో ఐదారుగురు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్దంగా ఉన్నారని తెలుస్తోంది.

# సచివాలయ ముట్టడికి యత్నించిన బిసి జనసభ

## సచివాయంలోకి చొచ్చుకుని పోయే యత్నం

## రాజారాం యాదవ్ తదితరుల అరెస్ట్

## అరెస్టులను ఖండించిన కెటిఆర్

హైదరాబాద్,జూలై 15 : తెలంగాణ సెక్రటేరియట్ వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయడం సహా, బీసీ కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు వంటి ప్రధాన డిమాండ్లతో బీసీ జనసభ నాయకులు, నిరుద్యోగులు సచివాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సచివాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట చోటు చేసుకుంది. పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా ఆందోళన కారులను అరెస్ట్ చేసి డీసీఎం వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగుల సెక్రటేరియట్ ముట్టడి పిలుపులో భాగంగా బీసీ జనసభ కార్యకర్తలు సచివాలయంలోకి చొచ్చుకెల్లేందుకు ప్రయత్నిం చారు. ఈ క్రమంలో నిరుద్యోగులు, జనసభ కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకున్నది. సెక్రటేరియట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీసీ జనసభ కార్యకర్తలను పోలీసులు పట్టుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలతో హోరెత్తింది. జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా కార్యకర్తలను అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో డీఎస్సీని వాయిదా వేయాలని రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదావేయకపోతే సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఏటా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, గ్రూప్ 2, 3 పోస్టుల పెంపు, డీఎస్సీ పరీక్షల వాయిదా, గ్రూప్-1 మెయిన్‌కు 1:100 పద్ధతిలో అభ్యర్థులను పిలవాలనే డిమాండ్లతో నిరుద్యోగులు, ఉద్యోగార్థులు రాష్ట్ర సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సెక్రెటేరియట్ పోలీసుల వలయంలోకి వెళ్లింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలిరానున్న నేపథ్యంలో సచివాలయం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. బాహుబలి బారికేడ్లు, ఇనుపకంచెలు, వాటర్ క్యానన్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి సచివాలయ ముట్టడికి తరలివస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసారు. ఇదిలావుంటే నిరుద్యోగ యువకులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం దుర్మార్గ పూరితంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. వారి సమస్యలను సానుకూల ధృక్పథంతో నెరవేర్చాల్సింది పోయి నిర్భంధం పెడతూ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల డిమాండ్ల కోసం సెక్రటేరియేట్ ముట్టడికి ప్రయత్నించిన రాజారాం యాదవ్ సహా ఇతర విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయటాన్ని కేటీఆర్ ఖండించారు. రాజారాం యాదవ్ పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని నమ్మబలికిన సర్కార్ ఇప్పుడు వారిని గాలికి వదిలేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకురావటం, శాంతియుతంగా ఆందోళన చేయటం కూడా ఈ ప్రజాపాలన నిషేధమా అని కేటీఆర్ ప్రశ్నించారు. గత కొన్ని రోజులుగా విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం అణిచివేత ధోరణిని సాగిస్తుందని ఇది ఎంత మాత్రం మంచిది కాదని హెచ్చరించారు. పోలీసులు అరెస్ట్ చేసిన రాజారాం యాదవ్ సహా మిగతా విద్యార్థి నాయకులందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వారిని ఇప్పుడు పట్టించుకోవటం మానేసిందని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న డిమాండ్లను పరిష్కరించకుంటే ఏ నిరుద్యోగులను రెచ్చగొట్టి గద్దెనెక్కారో ఇప్పుడు వాళ్లే ఈ ప్రభుత్వం పతనానికి కారణమవుతారన్నారు. నిరుద్యోగ డిమాండ్లను పరిశీలించకుండా ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరి అవలంభిస్తే తప్పకుండా బీఆర్ఎస్ తరఫున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

# ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారం

## అక్రమ తవ్వకాలపై రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్

## ఆగస్ట్ 2 వరకు విచారణ వాయిదా

న్యూఢిల్లీ,జూలై 15 : ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. అక్రమ తవ్వకాల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. మరిన్ని వివరాలు కోర్టు ముందుంచేందుకు కొంత సమయం కోరింది. గతంలో అధికారులు దాఖలు చేసిన నివేదికలపై అనుమానాలున్నాయని పేర్కొంది. వాస్తవాలు దాఖలు చేయలేదంటూ మీడియాలోనూ కథనాలు వచ్చాయని గుర్తుచేసింది. నివేదికలన్నీ పునఃపరిశీలించి ఆధారాలతో వివరాలు సేకరిస్తామని తెలిపింది. పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతామని ప్రభుత్వం తరపు న్యాయవాదులు చెప్పారు. మరోవైపు పూర్తిస్థాయి నివేదిక సమర్పణకు తమకూ సమయం కావాలని కేంద్రం కోరింది. 6 వారాల సమయం కావాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇప్పటికే తాము 7 జిల్లాల్లో తనిఖీలు జరిపి నివేదికను కోర్టు ముందుంచినట్లు చెప్పింది. మిగిలిన జిల్లాల్లోనూ తనిఖీలు జరిపేందుకు 6 వారాల సమయం కావాలని కోరింది. తమ ఆధారాలు పరిగణనలోకి తీసుకోవాలని పిటిషనర్ దండా నాగేంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న జస్టిస్ అభయ్ ఎస్ వోకా ధర్మాసనం విచారణను ఆగస్టు 2కు వాయిదా వేసింది. ఆగస్టు 2 కల్లా ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమాలకు సంబంధించి పిటిషన్‌పై సోమవారం సుప్రీంలో విచారణకు వచ్చింది. జస్టిస్ అభయ్ ఒకా ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. తదుపరి విచారణను ఆగస్టు 2కు ఉన్నతన్యాయస్థానం వాయిదా వేసింది. ఏపీలో ప్రభుత్వం మారిందని ఏపీ ప్రభుత్వం తరపు న్యాయవాది హుజెఫా అహ్మదీ... సుప్రీంకోర్టుకు తెలిపారు. గత అధికారులు ఇసుక తవ్వకాల్లో పెద్దగా ఉల్లంఘనలు జరగలేదని నివేదిక ఇచ్చారన్నారు. అదే సమయంలో మీడియాలో అందుకు విరుద్ధంగా ప్రసారాలు వచ్చాయని.. అందువల్ల రెండిటినీ పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం సమయం కోరిందని కోర్టుకు తెలిపారు. నివేదికతో పాటు ఉల్లంఘనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో 7 జిల్లాల్లో అక్రమ ఇసుక తవ్వకాలపై తనిఖీలు పూర్తి చేసామని, మరో ఆరు జిల్లాల్లో తనిఖీలు చేయాల్సి ఉందని సుప్రీంకోర్టుకు కేంద్ర పర్యావరణ శాఖ తరపు న్యాయవాది తెలిపారు. మరో ఆరు జిల్లాల్లో సర్వే పూర్తి చేసేందుకు ఆరు వారాల సమయం ఇవ్వాలని కోరారు. ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలపై కేంద్ర పర్యావరణ శాఖ మధ్యంతర నివేదిక÷ల్ చేసింది. ఏపీలో ఇసుక అక్రమాలపై పూర్తి స్థాయి నివేదిక÷ల్ చేస్తామని సుప్రీంకోర్టుకు పర్యావరణ శాఖ తరపు న్యాయవాది తెలియజేశారు. ఈ క్రమంలో ఏపీలో ఇసుక అక్రమాలపై విచారణను సుప్రీం

ధర్మాసనం ఆగస్టు 2కు వాయిదా వేసింది. కాగా... ఏపీలో ఇసుక అక్రమాలపై గతంలో కూడా సుప్రీం సీరియస్ అయిన విషయం తెలిసిందే. ప్రతి ఇసుక రీచ్‌ను సందర్శించి అక్కడ జరిగిన అక్రమాలపై నివేదిక ఇవ్వాలని కేంద్ర కమిటీకి సుప్రీం ఆదేశించింది. ఇసుక అక్రమాలను ఖరారు చేసి గతంలో జేపీ వెంచర్స్‌కు గ్రీన్ ట్రిబ్యునల్ భారీ జరిమానా విధించిన సంగతి విధితమే.

# ఆభరణాల తరలింపునకు మరో రోజు నిర్ణయం

## భాండాగారానికి పాముల కాపలా అబద్ధం

## తోసిపేచ్చిన ప్రత్యేక న్యాయమూర్తి

పూరీ,జూలై 15 : ఒడిశాలోని విశ్వప్రసిద్ధ శ్రీక్షేత్రంలో పూరీ జగన్నాథుని రత్నభాండాగారాన్ని అధికారులు ఆదివారం తెరిచారు. యావత్ దేశం ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న వేళ 46 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆలయంలోని రహస్య గది తలుపులు మెజిస్ట్రేట్ సమక్షంలో తెరిచారు. ఈ సందర్భంగా స్వామివారికి చెందిన విలువైన వస్తువుల్ని లెక్కించేందుకు 11మందితో ఏర్పాటు చేసిన బృందానికి సారథ్యం వహిస్తున్న ఒడిశా హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ మాట్లాడారు. మేజిస్ట్రేట్ సమక్షంలో గది తాళాలు పగలగొట్టిన తర్వాత తమ బృందం గదిలోకి ప్రవేశించిందని తెలిపారు. ఆ 'రహస్య గది' లోపల భాండాగారానికి పాములు కాపలాగా ఉన్నాయంటూ పెద్ద ఎత్తున జరిగిన ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. తమ బృందంలో ఏడెనిమిది మంది ఆలయ మేనేజ్‌మెంట్ సభ్యులు ఉన్నారని.. వీరంతా బహుడా యాత్ర సన్నహాల్లో బిజీగా ఉన్నందున తనిఖీలకు, ఆభరణాల తరలింపునకు తగిన సమయం లభించలేదని చెప్పారు. అందువల్ల దేవతామూర్తుల ఆభరణాలు, విలువైన రత్నాలను తరలింపునకు మరో తేదీని నిర్ణయిస్తామని తెలిపారు. శ్రీ జగన్నాథ్ ఆలయం పాలనాధికారి అరవింద పాఢి మాట్లాడుతూ.. అవుటర్ ట్రెజరీలో భద్రపరిచిన ఆభరణాలను ఆలయం ప్రాంగణం లోపల తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించినట్లు చెప్పారు. ఆ తర్వాత దీనికి మెజిస్ట్రేట్ సమక్షంలో సీలు వేసినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. పెంచిన తల్లి సన్నిధిలో జగన్నాథుని లీలలు ఆదివారంతో ముగియడంతో సోమవారం బలభద్ర, సుభద్ర, సుదర్శనులతో కలిసి స్వామి శ్రీ క్షేత్రానికి బయల్దేరారు. నందిఘోష్, తాళధ్వజ, దర్పదళన్ రథాలపై చేరుకోనున్నారు. ఈ వేడుకనే బహుడా యాత్రగా పేర్కొంటారు. ఇప్పటికే ఈ యాత్ర కొనసాగుతోంది. దాదాపు 8లక్షల మంది భక్తులు పాల్గొంటారనే అంచనాలతో అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

## వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్,జూలై 15 : గంజాయి, కొకైన్ లాంటి మత్తు పదార్థాలను సేవించి యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విద్యార్థులకు సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగం పట్ల కలిగే నష్టాలపై మామూనూర్ పోలీసుల అధ్వర్యంలో బొల్లికుంటలో గల వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అథిదిగా హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం ద్వారా నేడు యువత భవిష్యత్తు ప్రమాదంలో ఉందన్నారు.ఈ ప్రమాదం బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేవలం క్షణికానందం కోసం మత్తు పదార్థాల సేవించడం ద్వారా మీరు అనుకున్న లక్ష్యాలను సాధించడం ఓ కలగానే మిగిలి పోతుందని హెచ్చరించారు. కొంత మంది వ్యక్తులు తమ డబ్బు సంపాదన కోసం గంజాయి లాంటి మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడి యువతకు అందిస్తున్నారు. ఇలాంటి స్వార్థపరుల చేతుల్లో యువత బలికావద్దని కోరారు. యువత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని అందుకు అనుగుణంగా శ్రమించాలన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
16 జూలై
2024





# ఎంత ఎదిగినా ఒదిగి ఉండాల్సిందే

**గత ప్రభుత్వంలో రోడ్డుపైకి రావాలంటేనే భయం**

**చంద్రబాబును జైల్లో పెట్టారు...ఇసుకను దోపిడీ చేశారు**

**జనసేన విజయం కోసం పాటుపడ్డ వారికి అండగా నిలవాలి**

**ప్రజాప్రతినిధులు అవగాహనతో ముందుకు సాగాలి**

**జనసేనాని పవన్ కల్యాణ్ హెచ్చరిక**



గుంటూరు,జూలై 15 : వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్డుపైకి రావాలంటే భయమేసే పరిస్థితి ఉండేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టాలంటే భయం. ఇంట్లో వాళ్లపై కూడా దుర్భాషలాడిన పరిస్థితిని చూశామని అన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ప్రతినిధుల భేటీలో ఆయన మాట్లాడారు.పార్లమెంటు సభ్యుడిని బంధించి కొట్టించిన తీరు చూశాం. సుదీర్ఘ అనుభవం, సీఎంగా పనిచేసిన చంద్రబాబును కూడా జైలులో పెట్టారు. అడ్డగోలుగా ఇసుక దోపిడీ, భూ కుంభకోణాలు చేశారు. అందుకే ఐదు కోట్ల మంది ఒక్కటై అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని అన్నారు. నేను ప్రధాని మోదీ గుండెల్లో ఉన్నా.. ఆయన పక్కన నిల్చొని ఫొటో దిగాల్సిన అవసరం లేదు. అధికారం కోసం కాదు.. ప్రజల కోసం పోరాటం చేశాం. జనసేన తీసుకున్న మంత్రి పదవులు కూడా ప్రజలతో నిత్యం సంబంధం ఉన్నవి. మన పార్టీ ఎంపీలు ప్రజా సమస్యలపై పార్లమెంటులో మాట్లాడాలని అన్నారు. అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఎంత సాధించినా తగ్గి ఉండటం అవసరం. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కూడా ఇలాంటి మెజార్టీ రాలేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నాతో అన్నారు. వైకాపా వాళ్లు మనకు ప్రత్యర్థులు మాత్రమే, శత్రువులు కాదు. చేతగాక కాదు.. కక్ష సాధింపు చర్యలు ఎవరికీ మంచిది కాదు. వైకాపా చేసిన తప్పులు మనం చేయకూడదని అన్నారు. అలాగని వాళ్లు చేసిన తప్పులు సహించేదిలేదు.. చట్టపరంగా చర్యలు ఉంటాయి. జనసేన తరపున పోటీ చేసిన మొత్తం 21 మందిని గెలిపించారు. పోటీ చేసిన చోటే కాదు.. చేయని చోట్లా వీర మహిళలు, జనసైనికులు తీవ్రంగా పోరాడారు. బాధ్యతలు మోసే ప్రతిఒక్కరికీ నేను అండగా ఉంటానని అన్నారు. జనసైనికులు, వీర మహిళలు నావైపు బలంగా నిలబడ్డారు. ఎలాంటి పదవి ఆశించకుండా పోరాడారు. ఊహించని మెజారిటీతో గెలవడం గొప్ప విషయం. పంచాయతీల్లో బ్లీచింగ్‌కు కూడా డబ్బులు లేవు. ఏడీబీ ద్వారా నిధులు తెచ్చేందుకు మాట్లాడుతున్నాం. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరం. నేను ప్రధాని మోదీని ఇప్పటివరకూ ఏం అడగలేదు. ఇప్పుడు రాష్ట్రం కోసం అడుగుతా. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వద్దని చెబుతా. రైల్వే జోన్ ఏర్పాటు గురించి, 25 లక్షల ఉద్యోగాలు కావాలని అడుగుతా అని పవన్ తెలిపారు. పార్టీని అంచెలంచెలుగా పెరిగేలా చేయడంలో పవన్ చాలా ఓపికతో.. వ్యూహంతో వ్యవహరించారని మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ తరపున గెలిచిన ప్రజా ప్రతినిధులను అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సత్కరించారు. ముందుగా మంత్రి నాదెండ్లను సత్కరించారు. ప్రజా ప్రతినిధులకు శాలువా కప్పి, గిఫ్ట్ గా కూరగాయలు అందించి పవన్ సన్మానించారు. అనంతరం పవన్ కళ్యాణ్‌ను జనసేన ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ఉన్నామని... మిత్రపక్షాలతో సమన్వయంతో వెళ్లాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బంది.. మచ్చ రాకుండా అందరూ పని చేయాలని మంత్రి సూచించారు. పదవులు మనకొచ్చాయి.. కానీ మన కోసం పని చేసిన జనసైనికులు, వీర మహిళలను మరువద్దు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి. పార్టీ మీద, ప్రభుత్వం మీద దుష్ప్రచారం మొదలు పెడతారు.. తిప్పి కొట్టాలి. కూటమి ప్రభుత్వం అమలు చేసే పథకాలు.. అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలి. నిజాయితీగా పని చేయాలి. గత ప్రభుత్వం సంక్షేమం పేరుతో దోపిడీ చేసింది. త్వరలో క్రియాశీల సభ్యత్వాన్ని ప్రారంభించనున్నాం. గతంలో తక్కువ సంఖ్యలోనే క్రియాశీలక సభ్యులను చేర్పించాం. ఇప్పటి వరకు సుమారు కార్యకర్తలకు ఆర్థిక సాయం కింద రూ. 18 కోట్లు అందించామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వంలో ప్రతి జనసైనికుడూ భాగస్వామే అని తెలిపారు.ప్రభుత్వం విడుదల చేసే శ్వేత పత్రాలపై అవగాహన పెంచుకోవాలని.. ప్రజలకు వివరించాలన్నారు.ఇది మన ప్రభుత్వమని.. పార్టీకి.. పవన్‌కు మంచి పేరు వచ్చే విధంగా పని చేయాలన్నారు. పవన్ కళ్యాణ్ టీం అంటే ఇదీ అని అందరూ గొప్పగా చెప్పుకునేలా పని చేయాలన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు సైలెంటుగా ఓటేశారని.. ఎన్నికల ముందు వరకు ఏ మాత్రం బయటపడని ప్రజలు.. ఎన్నికల్లో తామేంటో చూపించారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# చిన్నారులపై అఘాయిత్యాలు

**కఠిన చర్యలు ఉంటాయన్న చంద్రబాబు**

**ఎర్ర దొంగలను కూడా వదిలేది లేదని హెచ్చరిక**

అమరావతి,జూలై15 : ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గత కొన్నిరోజులుగా చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై సీఎం నారా చంద్రబాబు తొలిసారి స్పందించారు. సోమవారం నాడు సెక్రటేరియట్‌లో గత ప్రభుత్వం గనుల శాఖలో చేసిన అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా.. శాంతి భద్రతలు, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కూడా మాట్లాడారు. రాష్ట్రంలో చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల విషయంలో ప్రభుత్వం చాలా కఠినంగా ఉంటుందని హెచ్చరించారు. అంతేకాదు.. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వారికి సీబీఎన్ స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇచ్చారు. 'ఏపీలో ఎవరైనా ఇంకా మత్తులో ఉంటే వారికి గట్టి హెచ్చరికలు చేస్తున్నాం. ఇంకా నా ఓపిక, సహనాన్ని పరీక్షిస్తున్నారు. ఇలాంటి వారికి ఎలాంటి షాక్ ట్రీట్మెంట్ ఇవ్వాలో ఇస్తాను.. అది ప్రజలందరూ చూస్తారు. నంద్యాలలో బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన.. విజయనగరంలో ఆర్నెళ్ల పసికందుపై అత్యాచార ఘటన సభ్య సమాజం తలదించుకొనేలా ఉంది. ఈ కేసులు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరిత గతిన విచారణ చేయాలి. బాధిత కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకుంటాం' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మొత్తానికి చూస్తే.. ఇకపై ఇలాంటి ఘటనలు పాల్పడే వారికి కఠిన చర్యలు ఉంటాయని 'ఎర్రచందనం స్మగ్లర్లపై కఠిన చర్యలు ఉంటాయి. నేరస్థులు, దోపిడీదారులను కఠినంగా శిక్షిస్తాం. బాండ్లు, రేషన్ బియ్యంలో అక్రమాలు జరిగాయి. దొంగకు తాళాలు ఇచ్చి దోచుకునేలా గత ప్రభుత్వం చేసింది. పర్యావరణాన్ని దెబ్బతీస్తే భావితరాలు దెబ్బతింటాయి. ప్రకృతి సంపద ప్రజలకు చెందాలి. గనుల బాధితులు మందుకు వచ్చి ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలి. ఎర్రచందనం దొంగ రవాణా కోసం అక్రమాలు జరిగాయి. ఎర్రచందనాన్ని చైనాకు దొంగ రవాణా చేశారు. ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని తగ్గించారు. ఎర్రచందనం స్మగ్లర్లను వైసీపీ నేతలు ప్రోత్సహించారు. స్మగ్లర్లను ప్రోత్సహించడం సమాజానికి ప్రమాదం. పల్నాడు జిల్లాలో ఇష్టానుసారం అటవీసంపద దోపిడీ జరిగింది. రుషికొండ కట్టడాలు.. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే. అడవులను మింగేసిన అనకొండలను శిక్షిస్తాం' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

# రుణమాఫీపై మభ్యపెట్టరే ప్రయత్నాలు

**పిఎం కిసాన్ డేటాకు ఏడు నెలలెందుకు**

**కాలయాపన చేయడంలో రైతులను మోసం చేసే కుట్ర**

**రుణమాఫీ మార్గదర్శకాలపై మండిపడ్డ నిరంజన్ రెడ్డి**

హైదరాబాద్,జూలై15(ఆర్ఎన్ఎ): రుణమాఫీకి పీఎం కిసాన్ డేటాను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడం.. రైతాంగాన్ని వంచించడమేనని మాజీ వ్యవసాయశ్శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. హామీలు ఇచ్చినప్పుడు లేని ఆంక్షలు .. అమలు చేసేటప్పుడు ఎందుకని ప్రశ్నించారు. ఈ ఆంక్షలు విధించడానికి ఈ ఏడు నెలల సమయం ఎందుకు తీసుకున్నట్లని అన్నారు. పంటల రుణమాఫీకి సంబంధించి రాష్ట్ర వ్యవసాయ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలపై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. అవి మార్గదర్శకాలు కావు.. మభ్య పెట్టేందుకు ప్రయత్నాలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ మార్గదర్శకాలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి రాష్ట్రంలో పడిన రైతుల రుణభారాన్ని తొలగించడం కోసం వ్యవసాయ సుస్థిరత కోసం కేసీఆర్ 2 విడుతల రుణమాఫీ పక్రియకు శ్రీకారం చుట్టారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలకు కేసీఆర్ సర్కార్ శ్రీకారం చుట్టింది. మొదటి విడుతలో 35.31 లక్షల మంది రైతులకు రూ. 16,144.10 కోట్లు రుణమాఫీ చేశారు. రెండో విడుతలో 22 లక్షల 98 వేల 39 రైతులకు రూ. 13,000.51 కోట్లు రుణమాఫీ చేశారు. ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం అసలు రైతులకు రుణాలే మాఫీ చేయనట్లు కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసింది. తాము అధికారంలోకి వస్తే ఇలా ఎన్నికలు అయిపోగానే అలా డిసెంబరు 9న రుణమాఫీ చేస్తాం అని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో ఉన్న 69 లక్షలపై చిలుకు ఉన్న తెలంగాణ రైతాంగంలో ఆశలు రేపింది. అందరి రుణాలను మాఫీ చేస్తామని ఆ రోజు బహిరంగంగా చెప్పారు. ఈ రోజు కొందరికే పరిమితం చేసేందుకు మార్గదర్శకాలు తీసుకువచ్చారు. ఈ రోజుల్లో 5
ఎకరాల వ్యవసాయదారుడు, రూ. 30 వేల జీతం చేసే ఉద్యోగి కూడా ట్యాక్స్ పరిధిలోకి వస్తున్నాడు. రేషన్ కార్డు, పీఎం డాటా వంటి తోకా తొండాలు పెట్టి కొందరినే రుణమాఫీకి పరిమితం చేస్తున్నారు. రుణమాఫీ చేశాం అన్న ప్రచారం చేసుకోవడానికి ప్రభుత్వ ప్రయత్నాలు తప్ప .. రైతాంగం బాగుండాలి .. వ్యవసాయం బాగుండాలి అన్న సంకల్పం ఈ ప్రభుత్వానికి లేదు అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. అసలు రాష్ట్రంలో రూ.2 లక్షల రుణం పొందిన రైతులు ఎంత మంది ఉన్నారో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి. పీఎం కిసాన్ డాటాను మార్గదర్శకంగా తీసుకుంటాం అని ఎన్నికల ప్రచారంలో చెప్పలేదు. అసలు దానికి సంబంధించిన షరతులే లోపభూయిష్టం అయినవి. రుణమాఫీకి పీఎం కిసాన్ డేటాను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడం.. రైతాంగాన్ని వంచించడమే .. హామీలు ఇచ్చినప్పుడు లేని ఆంక్షలు .. అమలు చేసేటప్పుడు ఎందుకు..? మరి ఈ ఆంక్షలు విధించడానికి ఈ ఏడు నెలల సమయం ఎందుకు తీసుకున్నట్లు ? నాడు పరుగెత్తి రుణాలు తీసుకోండి వెంటనే రుణమాఫీ చేస్తాం అని రైతులను పరుగులు పెట్టించి నేడు చావు కబురు చల్లగా చెబుతున్నారు.

# ప్రజాస్వామ్యానికి గంతలు కట్‌టి కొల్లగొట్టారు

**గనలును దోచేశారు..భూములను లాగేశారు**

**ఫేక్ డాక్యుమెంట్లతో అడ్డంగా దోచుకున్నారు**

**గనుల శాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు**

అమరావతి,జూలై 15 : సహజ వనరులైన భూములు, గనులు, అటవీ సంపదపై కూటమి ప్రభుత్వం సోమవారం శ్వేతపత్రం విడుదల చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యానికి గంతలు కట్టి ఆఫీసుల పేరుతో కొట్టేశారన్నారు. చివరకు ల్యాండ్‌ను ఎవ్వరిని అడగకుండా దోచేసేందుకు ఓ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ తెచ్చారని మండిపడ్డారు. గనులశాఖపై సిఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. విశాఖపట్నంలో ఇచ్చిన రామానాయుడు స్టూడియోను రెసిడెన్సియల్ అని చూపించి కొట్టేయాలని చూశారన్నారు. చివరకు సుప్రీంకోర్టుకు వెళ్లారన్నారు. హయగ్రీవ భూములు అప్పటి స్థానిక ఎంపీ, శారదాపీఠం, షాహీ హియరింగ్ కాలనీల పేరుతో కొట్టేయాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దస్పల్లా భూములు బలవంతంగా ట్విస్ట్ చేసి అక్కడ భూములు కొట్టేసి నిర్మాణాలు చేశారన్నారు. ఎంవీవీ, ఎంపీకే హౌసింగ్ పరుతో అసంబద్ధమైన ఒప్పందాలు చేసుకొని కొట్టేశారని ఆరోపించారు. ఒంగోలులో ఎన్నో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టిస్తే 77 మందిపై కేసులు పెట్టారన్నారు. ఇది ఇన్వెస్టిగేషన్‌లో ఉందని తెలిపారు. తివరుకు తిరుపతిలో సెటిల్మెంట్ ల్యాండ్‌లు, మఠం భూములను 22ఏ ఉపయోగించి కొట్టేశారన్నారు. ఎవ్వరి భూమి అయినా 22ఏ పెట్టి వీరు రిజిస్ట్రేషన్ చేయించుకొని మార్చేశారని తెలిపారు. 982ఎకరాలు పుంగనూరులో అరాచకంగా ఇచ్చేశార న్నారు. రైత్వారీ పట్టాలు ఇచ్చి ఇచ్చేశారని.... అది పెద్దిరెడ్డి నియోజకవర్గమని వెల్లడించారు. 10 వేల ఎకరాలు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ భూములు ఎస్సైన్డ్ ల్యాండ్ పేరుతో లాగేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతి లెక్కలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బయటపెడుతున్నారు. ఇందులో భాగంగానే శ్వేతపత్రాలను విడుదల చేస్తున్నారు. తాజాగా సహజ వనరులైన భూములు, గనులు, అటవీ సంపదపై విడుదల చేశారు. స్వయంగా సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గత ప్రభుత్వం అవినీతి ద్వారా సహజ వనరులు ఎలా దోచుకుంది..? పర్యవరణానికి ఎలాంటి ఇబ్బందులు గురించేసింది..? అనే విషయాలను పూసగుచ్చినట్లుగా వివరిస్తున్నారు. గత ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం సహజవనరులు దోపిడీ చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం అడవులను కూడా ధ్వంసం చేసిందని ఆరోపించారు. భూములు, ఖనిజాలు, అటవీ సంపద దోపిడీ జరిగిందని, వైసీపీ ప్రభుత్వం కొత్త విధానంతో దోపిడీ జరిగిందని విమర్శలు చేశారు. విశాఖ, ఒంగోలు, చిత్తూరులో భూకబ్జాలు చేశారని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణం పేరుతో వైసీపీ నేతలు దందాలకు దిగారని సీఎం చంద్రబాబు ఆరోపణలు చేశారు. అవినీతి ద్వారా సహజవనరులు ఎలా దోచు కుంటారు, పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు తెస్తారో చూశాం. గత ప్రభుత్వంలో పంచభూతాలను దోపిడి చేశారు. భూములు లిటిగేషన్ తెచ్చి కొట్టేయడం. గతంలో ఇండియన్ ఫారెస్ట్ సర్వీసును సైతం ఏర్పాటు చేసి అడవులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చాం. అయితే ఇప్పుడు అడవులను కూడా వైసీపీ నేతలు ధ్వంసం చేశారు. ఇప్పుడు నేను చెప్పే రికార్డులు ఒకవంతు అయితే వాస్తవానికి మూడు, నాలుగు రెట్లు విధ్వంసం జరిగింది. పట్టణప్రాంతాల్లో ఉన్న భూములు అంటే ఉదాహరణకు కావాలి, నెల్లూరు, ధర్మవరంలో కూడా మార్నింగ్ వాక్ పేరుతో దోచేశారు. హౌస్ సైట్స్ పేరుతో ఈ దందాను నడిపించారు. ప్రజాస్వామ్యా నికి గంతలు కట్టి ఆఫీసులు పేరుతో కట్టేశారు. చివరకు ల్యాండ్‌ను ఎవ్వరిని అడకుండా దోచేసేందుకు ఓ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ తెచ్చారు' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎవ్వరి భూమి అయినా 22ఏ పెట్టి వీరు రిజిష్ట్రేషన్ చేయించుకొని మార్చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో 982ఎకరాలు పుంగనూరులో అరాచకంగా ఇచ్చేశారు. రైత్వారీ పట్టాలు ఇచ్చి ఇచ్చేశారు. 10వేల ఎకరాలు ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ భూములు అసైన్డ్ ల్యాండ్ పేరుతో ఆక్రమించారు. హౌసింగ్ కాలనీ ఎక్కడ రావాలో వైసీపీ నేతలే డిసైడ్ చేస్తారు. వాటికి ఎక్కువ రేటు పెట్టి కొట్టేశారు. ఆవభూములు, ఊరుకు దూరంగా ఉన్న భూములు, పొలాలకు వెళ్లే భూములు, శ్మశానాలు కూడా ఇళ్లనిర్మాణానికి ఇచ్చారు. 361 ఎకరాలు 161 కోట్ల రూపాయలుకు ఇచ్చారు. నివాసయోగ్యం కాని భూములు ఇచ్చారు. 286ఎకరాలను రూ.185కోట్లుకు కొనుగోలు చేశారు. గన్నవరంలో కూడా మార్కెట్ రేట్ల కంటే 5 రెట్లు ఎక్కువ ఇచ్చి దోచేశారు' అని సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ అనే ఓ చట్టాన్ని తెస్తున్నాం. ఇందులో నిరూపించుకోవాల్సిన బాధ్యత గ్రాబర్‌కు ఉంటుంది. గుజరాత్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 2020 లైన్స్ లోనే ఈ చట్టం తెస్తాం. మైనింగ్ విషయంలో భారీగా పెనాల్టీ వేసి ఇబ్బందులు పెట్టారు. ఒక్క మైనింగ్ విషయంలోనే రూ.20వేల కోట్లు దోపిడీ చేసి ఉండొచ్చు అయితే అంతకు మించి అవినీతి చేసి ఉంటారు. ఇసుక మైనింగ్‌లో రూ.7వేల కోట్లు, డబ్బులు ఎగ్గొట్టాలని చూస్తున్నారు.ఇప్పుడు కూడా సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసి కేసును ఆగస్టు నెలకు వాయిదా వేసింది. టా÷-గ్గ÷ట్ చేస్గి ÷న్లు వేయడం, నిబంధనలు పాటించకుండా మైనింగ్‌లో దోపిడీ చేశారు. 2016లో ఉచిత ఇసుక ఉండేది నిర్మాణ రంగానికి బూస్టు ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక నియంత్రణ చేసి 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉద్యోగాలు లేకుండా చేశారు. 130మంది భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# మొక్కలను నాటి..పచ్చదనం పెంచాలి

**ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి**

కామారెడ్డి,జూలై 15 : వాతావరణంలో అసమానతలు తొలగించేందుకు పర్యావరణాన్ని రక్షించడంలో మొక్కలు పెంపకం తప్పనిసరి అని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. వన సంరక్షణలో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఇది లాభాపేక్ష లేని కార్యక్రమంగా చూడాలన్నారు. పోడు పట్టాలు పొందిన రైతులు తప్పకుండా మొక్కలు పెంచాలన్నారు. ఇలా అయినా కొంత పచ్చదనం దోహదపడగలదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏదైనా గ్రామాన్ని దత్తతగా భావించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అన్నారు. వ్యాపార దృక్పథంతో చూడకుండా సమాజానికి ఏదైనా పది కాలాల పాటు మేలు కలిగేలా ఉండే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమంలో పాల్గొని భావితరాలకు పచ్చదనం, ఆరోగ్యకర సమాజాన్ని అందించాలని అన్నారు. నేషనల్ హైవే వెంబడి మొక్కలు పెద్ద ఎత్తున నాటడం జరుగుతుందని తెలిపారు. ఇకపోతే ప్రతీ గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నామని అధికారులు అన్నారు.ప్రతీ గ్రామంలో ఈజీఎస్ అధికారులతో నర్సరీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతీ గ్రామంలో స్థలాలను ఎంపిక చేస్తున్నామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, వన సంరక్షకుల ఆధ్వర్యంలో మొక్కలను పెంచుతామన్నారు. ముందుగానే ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకారం పచ్చదనాన్ని 33 శాతానికి చేరాలంటే జిల్లాలో ప్రతి ఒక్కరూ 20 మొక్కలు నాటాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా చాలా చోట్ల అడవి తగ్గిపోయింది. పచ్చదనం కాస్తా కనుమరుగై మైదానాలను తలపిస్తోంది. జిల్లా అంటే ఒకప్పుడు సువిశాల అటవీ ప్రాంతం ఇప్పుడు కాస్తా అడవి హరించుకుపోవడంతో వర్షాలు లేక ఏటా అక్కడక్క డ అల్ప వర్షాపాతం సైతం నమోదు అవుతోంది. అటవీ సంపదను పునరుద్ధరించి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వం పథకాన్ని అమలు చేస్తోంది. పల్లెల్లో పచ్చదనం వెల్లివిరిసేలా చూస్తోంది. గ్రామాలు, పట్టణాల్లో చైతన్యవంతులైన ప్రజలు మొక్కలు నాటే కార్యాక్రమంలో పాల్గొంటే సంకల్పం నెరవేరినట్లేనని అధికారులు భావిస్తున్నారు. టేకు మొక్కలతో పాటు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, యూకలిప్టస్, కానుగ, వేప, జామాయిల్ తదితర రకాల మొక్కలు కొద్ది రోజుల్లోనే నాటేందుకు సిద్ధం కానున్నాయి.

# ఎస్‌బిఐ వడ్డీరేట్లు పెంపు

**వెంటనే అమల్లోకి వచ్చిన నిర్ణయం**

న్యూఢిల్లీ,జూలై 15 : దేశీయ అతిపెద్ద బ్యాంక్ 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' నిధుల వ్యయం ఆధారిత రుణ వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు సోమవారం వెల్లడించింది. కొన్ని కాలపరిమితులపై ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్ల (0.10 శాతం) వరకు పెంచింది. సవరించిన రేట్లు సోమవారం నుంచే అమలవుతాయని ఎస్‌బీఐ తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఏడాది కాలవ్యవధి గల ఎంసీఎల్ఆర్‌ను 8.75 శాతం నుంచి 8.85 శాతానికి, ఆరు నెలల కాలవ్యవధికి 8.65 శాతం నుంచి 8.75 శాతానికి, రెండేళ్లకు 8.85 శాతం నుంచి 8.95 శాతానికి, మూడేళ్ల కాలపరిమితి 8.95 శాతం నుంచి 9 శాతానికి ఎస్‌బీఐ పెంచింది. దీంతో ఎంసీఎల్ఆర్ ఆధారిత లోన్ల ఈఎంఐలు మరింత భారం కానున్నాయి. ఎస్‌బీఐ ఆటో రుణాలు ఒక సంవత్సరం, వ్యక్తిగత రుణాలు 2 సంవత్సరాల ఎంసీఎల్ఆర్‌కు అనుసంధా నించి ఉన్నాయి. ఎంసీఎల్ఆర్ అనేది ప్రామాణిక రుణ రేటు. నిధుల సేకరణకు బ్యాంకులకు అయ్యే వ్యయం, నిర్వహణ వ్యయం, క్యాష్ రిజర్వు రేషియో (సీఆర్ఆర్), కాలపరిమితి, ప్రీమియంలను పరిగణలోకి తీసుకుని ఎంసీఎల్ఆర్‌ను లెక్కిస్తారు. బ్యాంకులు ఎంసీఎల్ఆర్ కంటే తక్కువకు రుణం అందించే అవకాశం ఉండదు. వివిధ కాలపరిమితులకు (ఓవర్ నైట్ నుంచి మూడేళ్ల వరకు) ఎంసీఎల్ఆర్ వేర్వేరుగా ఉంటుంది. ఎస్‌బీఐ ప్రస్తుతం గృహ రుణాలను 'ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్స్' ఆధారంగా ఇస్తోంది. దీంట్లో మాత్రం ఎలాంటి సవరణలు చేయలేదు. ప్రస్తుతం ఈ ఈబీఎల్ఆర్ 9.15శాతం ? సీఆర్‌పీ ? బీఎస్‌పీ వద్ద స్థిరంగా ఉంచింది. ప్రస్తుతం ఎస్‌బీఐ హోంలోన్ వడ్డీరేటు 8.50 శాతం నుంచి 9.65 శాతం మధ్య కొనసాగుతోంది. సిబిల్ స్కోర్ సహా ఇతర అర్హతలను బట్టి ఇది మారుతుంది.

# తనపై బురదజల్లే వారిని వదిలిపెట్టం

**ఆదివాసీ మహిళా అధికారిణితో సంబంధాలా**

**మీడియా ప్రతినిధుల తీరుపై విజయసాయి మండిపాటు**

విశాఖపట్నం,జూలై 15 : క్రమపద్ధతిలో తనపై కుట్రలు చేస్తున్నారని వైకాపా ఎంపీ విజయసాయి రెడ్డి ఆరోపించారు. కొన్ని మీడియా ఛానళ్లు.. ఆదివాసీ మహిళా అధికారిణితో సంబంధాలు అంటగట్టి అవాస్తవాలను ప్రసారం చేశాయన్నారు. నిరాధార ఆరోపణలు చేశారని ఆక్షేపించారు. పలువురు మీడియా ప్రతినిధులను పేరు పెట్టి హెచ్చరించారు. ఆయా ఛానళ్లపై ఫిర్యాదు చేస్తానని.. తనపై బురదచల్లే వారిని వదిలి పెట్టబోనని వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయసాయి రెడ్డి మాట్లాడారు. ఆదివాసీ ఆడబిడ్డను బజారుకీడ్చి నా వ్యక్తిత్వంపై కుట్ర పన్నారు. గత మూడు రోజులుగా ట్రోల్ చేశారు. ఆరోపణలు చేసే ముందు వివరణ తీసుకోవాలి. అలా చేయకుండా అవాస్తవాలు టెలికాస్ట్ చేయడం ఘోర తప్పిదం. వారితో ఎలా క్షమాపణలు చెప్పించాలో తెలుసు. ప్రతిపక్షంలో ఉన్నారు.. ఏం చేస్తారు అనుకోవద్దు. దీనిపై పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్ మూవ్ చేయడంతో పాటు ప్రైవేటు బిల్లు పెడతా. ఎడిటర్స్ గిల్డ్, మహిళా కమిషన్, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం. పరువు నష్టం దావా వేస్తా. గతంలో ప్రజాదర్బార్ నిర్వహించేవాడిని. చాలా మంది తమ సమస్యలపై వచ్చి కలిసేవారు. అలా కలిస్తేనే సంబంధాలు అంటగడతారా? తారతమ్యాలు లేవా? వయసు తెలియదా? సాయిరెడ్డి తండ్రిలాంటివారని స్వయంగా అధికారిణెళి చెప్పింది. నేను కూడా త్వరలోనే నా సొంత మీడియాను ప్రారంభిస్తా. ఇప్పటికే కాలయాపన చేశాను.. మళ్లీ నిర్ణయం తీసుకున్నా. ఈసారి ఎవరు చెప్పినా వినేది లేదు. అందరి దుశ్చర్యలను ఎండగడతానని విజయసాయిరెడ్డి అన్నారు.

## మచ్చుమర్రి బాలిక కుటుంబానికి పదిలక్షల పరిహారం

**దోషులను వదిలేది లేదన్న హోంమంత్రి అనిత**

అమరావతి,జూలై 15 : మచ్చుమర్రి అత్యాచార నిందితులను వదిలే ప్రసక్తే లేదని, కఠినంగా శిక్షిస్తామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ముచ్చుమర్రి కేసులో బాధిత బాలిక కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. మరోచోట అత్యాచారానికి గురైన బాలిక పేరుతో రూ.5లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని వెల్లడించారు. ఆడపిల్లతో అసభ్యంగా ప్రవర్తించిన వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. అమరావతిలో ఆమె మీడియాతో మాట్లాడారు. నంద్యాల జిల్లా పగిద్యాల మండలం ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లాల గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై మైనర్ బాలురు అత్యాచారం చేశారు. 14 నుంచి 16 ఏళ్లలోపు వయసున్న ముగ్గురు.. ఆ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి ఇంట్లో చెబుతుందన్న భయంతో హత్య చేసినట్లు సమాచారం. బాలిక ఆచూకీ కోసం పోలీసులు చేపట్టిన గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## గప్పాడ ఇసుక నిల్వల లెక్కు తీయండి: స్పీకర్

నర్సీపట్నం,జూలై 15 : అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం గప్పాడ డిపోలో ఇసుక నిల్వలకు లెక్కలు లేకపోవడంపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు విస్మయం వ్యక్తం చేశారు. సోమవారం ప్రభుత్వ ఇసుక డిపోను ఆయన పరిశీలించారు. 63వేల మెట్రిక్ టన్నుల నిల్వలపై దర్యాప్తు చేసి నిగ్గు తేల్చాలని గనులశాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ ఇసుక నిల్వలు ఎవరు తెచ్చారో అధికారులు చెప్పలేకపోతున్నారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. ఆ తర్వాతే ఇసుక ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు.

# నాయుడుపేట సంక్షేమ హాస్టల్లో ఫుడ్ పాయిజనింగ్

**వందమంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత**

**ఘటనపై ఆరా తీసిన మంత్రి డోలా**

తిరుపతి,జూలై 15 : తిరుపతి జిల్లా నాయుడుపేటలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 50 మంది తీవ్ర, మరో 50 మంది స్వల్ప అనారోగ్యం పాలయ్యారు. రెండు రోజుల క్రితం వండిన ఆహార పదార్థాలు వడ్డించడంతోనే అస్వస్థతకు గురికావాల్సి వచ్చిందని బాధిత విద్యార్థులు ఆరోపించారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య సేవలందిస్తున్నారు. విద్యార్థులను స్థానిక తహసీల్దార్ కల్యాణి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. నాయుడుపేటలో విద్యార్థులకు అస్వస్థతపై మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి స్పందించారు. ఘటనపై ఆయన విచారం వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పర్యటనలు వాయిదా వేసుకొని హుటాహుటిన నాయుడుపేటకు బయల్దేరారు. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో అతిసారం ప్రబలింది. మంత్రాలయం, ఆదోని ఆస్పత్రుల్లో 40 మంది బాధితులు చేరారు. వాంతులు, విరేచనాలతో జ్యోతి అనే నాలుగేళ్ల బాలిక మృతిచెందింది. దీనిపై మంత్రి టీజీ భరత్ స్పందించారు. జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వ్యాధి నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బందిని ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 15
జూలై 2024



# అర్జెంటీనాదే కోపా అమెరికా

## కొలంబియాపై ఉత్కంఠ గెలుపు... 16వ సారి టైటిల్ కైవసం




మియామి: అమెరికా వేదికగా జరిగిన 'కోపా అమెరికా' టైటిల్‌ను డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా నిలబెట్టుకుంది. ఇక్కడి హార్డ్‌రాక్ స్టేడియం వేదికగా జరిగిన తుదిపోరులో అర్జెంటీనా **1-0**తో కొలంబియాను ఓడించింది. **112**వ నిమిషంలో ఆ జట్టు ఆటగాడు లాటరో మార్టినెజ్ చేసిన గోల్‌తో అర్జెంటీనా ఈ టోర్నీ చరిత్రలో ఏకంగా **16**వ టైటిల్‌ను సొంతం చేసుకుంది.

తన కెరీర్‌లో చివరి కోపా అమెరికా మ్యాచ్ ఆడిన అర్జెంటీనా సారథి లియోనల్ మెస్సీ ఈ మ్యాచ్ సగంలోనే గాయం కారణంగా మైదానాన్ని వీడినా ఆ జట్టు అద్భుత పోరాటపటిమతో కొలంబియాను చిత్తుచేసింది. **23** ఏండ్ల తర్వాత ఫైనల్ చేరిన కొలంబియా.. విజయం కోసం ఆఖరి నిమిషం దాకా శ్రమించినా ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. ఆ జట్టు ఆటగాడు జేమ్స్ రోడ్రిగ్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు దక్కింది.

ఫైనల్ పోరుకు ముందు టికెట్లు లేకుండా మైదానంలోకి వచ్చిన అభిమానులు అరాచకం సృష్టించడంతో గంటా **22** నిమిషాల పాటు ఆలస్యంగా మొదలైన ఈ మ్యాచ్‌లో గోల్స్ కోసం రెండు జట్లూ నువ్వానేనా అన్నట్టుగా తలపడ్డాయి. అర్జెంటీనా స్టార్ ఆటగాడు మెస్సీ **64**వ నిమిషంలో మైదానాన్ని వీడాడు. మ్యాచ్ నిర్దేశిత సమయంలో ఇరుజట్లూ ఒక్క గోల్ చేయకపోవడంతో ఫలితం కోసం అదనపు సమయాన్ని కేటాయించగా మ్యాచ్ ఇక ముగుస్తుందనగా మార్టినెజ్ గోల్ కొట్టి అర్జెంటీనాకు విజయాన్ని అందించాడు. ఈ టోర్నీలో అతడినే 'గోల్డెన్ బూట్' అవార్డు వరించింది. **2021**లో కోపా అమెరికా టైటిల్ నెగ్గిన అర్జెంటీనా.. **2022**లో ఫిఫా వరల్డ్ కప్‌తో పాటు తాజాగా ఈ టోర్నీలో గెలిచి ఫుట్‌బాల్ చరిత్రలో స్పెయిన్ తర్వాత వరుసగా మూడు మేజర్ టోర్నీలు గెలిచిన రెండో జట్టుగా రికార్డులకెక్కింది. స్పెయిన్ **2008, 2012**లో యూరో కప్ నెగ్గగా **2010**లో వరల్డ్ కప్ గెలిచింది.

# హార్దిక్ పాండ్యాకు ఘన స్వాగతం..

టీ**20** ప్రపంచకప్ **2024** గెలిచిన తర్వాత స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాకు వడోదరలో ఘనస్వాగత ం లభించింది. అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బార్బడోస్‌కు తిరిగి వచ్చిన తర్వాత హార్దిక్ పాండ్యా ఢిల్లీ చేరుకున్నాడు. ఇక్కడ ఆయన ప్రధాని మోడీని కలిశారు. దీని తర్వాత ముంబైలో టీమ్ ఇండియా గ్రాండ్ విక్టరీ పెరేడ్ జరిగింది. ఇందులో.. భారత జట్టు ఛాంపియన్‌ను చూసేందుకు వేలాది మంది ప్రజలు మెరైన్ డ్రైవ్ వీధుల్లో సందడి చేశారు. టీమిండియా బస్సు వాంఖడే స్టేడియంకు చేరుకోవడానికి గంటల తరబడి పట్టింది. విక్టరీ పరేడ్ తర్వాత హార్దిక్ పాండ్యా ముంబైలో ఉన్నాడు. ఈ సమయంలో.. అతను అనంత్ అంబానీ-రాధిక మర్చంట్ వివాహానికి హాజరయ్యాడు. పెళ్లి వేడుకలో హార్దిక్ పాండ్యా చాలా సరదాగా కనిపించాడు. పాండ్యా వడోదర చేరుకున్నాడు. హార్దిక్ పాండ్యా వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియోలో వరల్డ్ కప్ తర్వాత మొదటి సారిగా సొంత గడ్డకు చేరుకున్న హార్దిక్ ను చూసేందుకు జనాలు భారీగా తరలి వచ్చారు. వేలాది మంది అభిమానుల సమక్షంలో పాండ్యా బస్సులో నిలబడి ఉన్నాడు. ప్రైడ్ ఆఫ్ వడోదర అని బస్సుపై రాసి ఉంది.భారత జట్టు టీ**20** ప్రపంచకప్ గెలవడంలో అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక పాత్ర పోషించాడు. తన బౌలింగ్‌తో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ సీజన్ లో**150** స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన పాండ్యా **144** పరుగులు చేశాడు. **11** వికెట్లు పడగొట్టాడు. **30** ఏళ్ల హార్దిక్ పాండ్యా తన కెరీర్‌లో మొత్తం **11** టెస్టులు, **86** వన్డేలు, **100** టీ**20** మ్యాచ్‌లు ఆడాడు. ఈ వరల్డ్ కప్ తన కెరీర్ లో మైలురాయిగా మిగలనుంది.



## ధోనీ జిడ్డు బ్యాటింగ్‌తోనే 2019 ప్రపంచకప్‌లో టీమిండియా ఓడింది: సౌరవ్ గంగూలీ





భారత క్రికెట్‌లో అత్యంతగా బాధపెట్టే సందర్భం ఏదైనా ఉందా? అంటే అది **2019** వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ ఓటమి. న్యూజిలాండ్‌తో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్ **18** పరుగుల తేడాతో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆ టోర్నీ అసాధారణ ప్రదర్శనతో సెమీఫైనల్ చేరిన టీమిండియా.. తప్పక గెలవాల్సిన ఆ మ్యాచ్‌లో మాత్రం దారుణంగా విఫలమైంది. వర్షం కారణంగా రెండు రోజుల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత **50** ఓవర్లలో **8** వికెట్లకు **239** పరుగులు చేసింది. అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత్.. మ్యాట్ హెన్రీ ధాటికి **24** పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా ఆచితూచి ఆడుతూ ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశాడు. కానీ భారీ షాట్స్ ఆడే క్రమంలో ఇద్దరూ ఔటయ్యారు. దాంతో భారత్ **92** పరుగులకే **6** వికెట్లు కోల్పోయిన టీమిండియా ఓటమి అంచున నిలిచింది. ఈ పరిస్థితుల్లో రవీంద్ర జడేజా, మహేంద్ర సింగ్ ధోనీ అసాధారణ బ్యాటింగ్‌తో టీమిండియా శిబిరంలో ఆశలు రేకెత్తించారు. ఓవైపు జడేజా దూకుడుగా ఆడి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. మరోవైపు మహేంద్ర సింగ్ ధోనీ స్లోగా బ్యాటింగ్ చేశాడు. ఓవైపు చేయాల్సిన రన్ రేట్ పెరుగుతున్నా ధోనీ సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. దాంతో ఒత్తిడికి గురైన రవీంద్ర జడేజా భారీ షాట్ ఆడే క్రమంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. **12** బంతుల్లో **32** పరుగులు చేయాల్సిన పరిస్థితుల్లోనే ధోనీ సింగిల్స్‌కే పరిమితమవ్వడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. **49**వ ఓవర్ తొలి బంతిని సిక్సర్‌గా తరలించిన ధోనీ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అదే ఓవర్ మూడో బంతికి క్విక్ డబుల్ తీసే క్రమంలో రనౌటయ్యాడు. దాంతో టీమిండియా **221** పరుగులకే కుప్పకూలి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వ్యవహరించిన సౌరవ్ గంగూలీ.. ధోనీ వ్యూహాన్ని తీవ్రంగా తప్పుబట్టాడు. అసలు ధోనీ ఏం చేస్తున్నాడో తనకు అర్థం కావడం లేదన్నాడు. మాటలు రావడం లేదని తన వ్యాఖ్యానంలో చెప్పుకొచ్చాడు. అతని జిడ్డు బ్యాటింగ్ కారణంగానే ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓటమిపాలైందని చెప్పుకొచ్చాడు. ధాటిగా ఆడాల్సిన స్థితిలో సింగిల్స్ తీయడం ఏంటని అసహనం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ధోనీ రనౌట్ కాకుంటే మ్యాచ్ గెలిపించేవాడని అతని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. అప్పటికే భారత్ **10** బంతుల్లో**24** పరుగులు చేయాలి. ధోనీ ఔటవ్వకపోయి ఉంటే... ఫలితం భారత్‌కు అనుకూలంగా ఉండేది. చివరి **10** బంతుల్లో మూడు సిక్స్‌లు బాదినా టీమిండియా సునాయసంగా గెలిచేది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News






# తనకంటే చిన్నవాడితో ప్రేమ?

ప్రమోషన్లకు రాదు, స్టార్ హీరోలను కూడా లెక్కచేయదు అనే అభిప్రాయాలు నయనతారపై చాలామందిలో ఉన్నాయి. కానీ ఆమె మాత్రం కథ నచ్చితే చిన్న హీరోల పక్కన కూడా చేయడానికి వెనుకాడదు. ఇది నయనతారలోని ఇంకో యాంగిల్ అనొచ్చు. రీసెంట్‌గా నయన్ ఓ సినిమా ఒప్పుకుంది. ఈ సినిమాకు హీరో కెవిన్‌రాజ్. తమిళ బిగ్‌బాస్‌తో ఇతను లైమ్‌లైట్‌లోకొచ్చాడు.
ఈ సినిమాను నయన్ భర్త విఘ్నేశ్ నిర్మించనున్నాడట. విష్ణు ఇడవన్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కానున్నాడు. ఇందులో నయన్ పాత్ర గురించి ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. కథ రీత్యా ఇందులో నయన్ హీరోకంటే వయసులో పెద్ద అట. కానీ.. చిన్నవాడైన హీరోను లవ్ చేస్తుందట. ఈ కథ నచ్చే నయన్ చేయడానికి ఒప్పుకుందని తెలుస్తోంది. ఏదేమైనా తాను హీరోగా నటిస్తున్న సినిమాలో నయనతార వంటి సూపర్‌స్టార్ హీరోయిన్ కావడంతో కెవిన్‌రాజ్ ఆనందానికి పట్టపగ్గాల్లేవట.



# నాలుగేళ్ల నాటి డ్యాన్స్ కట్‌పై ట్రోల్సా ?

హైదరాబాద్: తన డ్యాన్స్‌ను ట్రోల్ చేస్తూ సోషల్‌మీడియా వేదికగా ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌పై నటి అనసూయ స్పందించారు. పారదర్శక, గౌరవప్రదమైన విమర్శలను తాను ఆహ్వానిస్తానని చెప్పారు. 'నా మానసిక ప్రశాంతతను దృష్టిలో ఉంచుకొని కొన్ని విషయాలపై స్పందించకూడదని నిర్ణయించుకున్నా. మహానటి సావిత్రమ్మకు నివాళిగా దాదాపు నాలుగేళ్లక్రితం ఓ ఈవెంట్‌లో నేనిచ్చిన ప్రదర్శనలోని కొన్ని డ్యాన్స్ మూమెంట్స్‌ను ట్రోల్ చేయడం.. వాటికి ఇలా అవమానకర రీతిలో విమర్శలు చేయడం బాధాకరం. ఇక్కడ నా గురించి చెప్పట్లేదు.. నివాళులకు సంబంధించిన విషయాల్లో ఇలా చేయడం ఆ గొప్ప వ్యక్తులను అవమానపర్చినట్లే..! మర్యాదపూర్వకమైన విమర్శలను నేను ఎప్పుడూ స్వాగతిస్తా. ఆ కార్యక్రమంలో నా మొత్తం ప్రదర్శన చూసిన తర్వాత మీరు ఒక నిర్ణయానికి రండి' అని ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. అనసూయ ప్రస్తుతం వరుస సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారు. 'పుష్ప 2'తోపాటు 'ఫ్లాష్‌బ్యాక్', 'వోల్ఫ్' వంటి తమిళ చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# త్రిష.. ఇంకాస్త సన్నగా..

నాలుగు పదుల వయసులో యంగ్ హీరోయిన్లకు గట్టి పోటీనిస్తూ దూసుకుపోతోంది సీనియర్ బ్యూటీ త్రిష. వయసు అనే పదం.. పక్కన పెట్టేసి తన అందం చందాలతో రెండు దశాబ్దాలకు పైగా సినీ ప్రియులను అలరిస్తోంది. ఇప్పటికే అదే ఫామ్ ను కొనసాగిస్తోంది. మధ్యలో కొన్నాళ్లపాటు ఆమె కెరీర్ కాస్త నత్త నడకన నడిచినా.. ఇప్పుడు మళ్లీ సూపర్ ఫామ్ లోకి వచ్చేసింది. వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తూ బిజీగా గడుపుతోంది.
మణిరత్నం తెరకెక్కించిన పొన్నియన్ సెల్వన్ సిరీస్ చిత్రాలతోపాటు స్టార్ హీరో విజయ్ దళపతి లియో మూవీ తర్వాత త్రిషకు వరుస ఆఫర్లు దక్కుతున్నాయి. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవితో కలిసి విశ్వంభర మూవీలో యాక్ట్ చేస్తోంది. తమిళ స్టార్ హీరో అజిత్ విడా ముయరాచి సినిమాలో నటిస్తోంది. కమల్ హాసన్ - మణిరత్నం కాంబోలో వస్తున్న యాక్షన్ డ్రామా థగ్ లైఫ్ లో కూడా త్రిష భాగమైంది. విజయ్ గోట్ మూవీలో క్యామియో రోల్ చేస్తోంది. అలా అటు తమిళంలో.. ఇటు తెలుగులో అనేక సినిమాల్లో నటిస్తోంది త్రిష. వరుస షూటింగ్స్ లో పాల్గొంటూ బిజీ బిజీగా గడుపుతోంది. విదేశాల్లో షూటింగ్స్ జరుగుతుంటే అక్కడికి వెళ్లి.. మళ్లీ ఇండియా వస్తోంది. అయితే తాజాగా త్రిష.. సోషల్ మీడియాలో అదిరిపోయే పిక్ ను షేర్ చేసింది. మిర్రర్ సెల్ఫీని ఎక్స్ లో పోస్ట్ చేసింది. ఆ ఫోటోకు ఉకియో అని క్యాప్షన్ ఇచ్చింది. దీంతో దాని అర్థమేంటో తెలుసుకోవడానికి నెటిజన్లు తెగ ట్రై చేస్తున్నారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986